

మంచు.. మసకేసిందిలే..

ప్రతి రోజూ ఉదయం సూరీడుని ఏం చూస్తారు.. నన్ను చూడండి అంటూ మంచుదుప్పటి కప్పేసింది.. పల్లెలు.. పట్టణాలను తన ఒడిలో దాచుకుంది.. శుక్రవారం ఉదయం 10 గంటలైనా వెలుతురు కానరాలేదు.. మంచు కప్పేసింది.. కాసేపటికి కలలా మంచు కరిగిపోయింది.. అంతే మెల్లమెల్లగా సూరీడు బయటకు వచ్చి వెలుగును ప్రసరింపజేశాడు.. ఇటువంటి వాతావరణం చూసి చాలాకాలం కావడంతో గోదావరి జిల్లాల్లో జనం పులకించిపోయారు.. షోయగాన్ని మనసారా ఆస్వాదించారు.. ఉదయం వాహనాలపై వెళ్లేవారు మాత్రం కాస్త ఇబ్బందులకు గురయ్యారు.

8

భళా..బాలికా





జాతీయ బాలికా దినోత్సవాన్ని రాజానగరం మండలం కానవరం గాయత్రి విద్యా సంస్థల్లో ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థినులు బాలిక, విద్య అనే అక్షర పదజాలం ఆకృతిలో ఆశీనులై ఆలోచింపజేశారు.. - రాజానగరం



నిడదవోలు సమిశ్రగూడెం సెంటర్‌లో కమ్మేసిన మంచు

మీతోనే!

సభ్యత్వంలోనూ చరిత్ర లిఖించెన్



- టీడీపీ వెంటే లక్షలాదిగా జనం
- సభ్యత్వ నమోదులో రికార్డు
- ఓటర్లు 45.16 లక్షలు
- టీడీపీ సభ్యులు 9.97 లక్షలు
- నియోజకవర్గానికి 50 వేలు
- గత రికార్డులు బద్దలు
- ఉత్సాహంగా టీడీపీ కేడర్
- ఉమ్మడి జిల్లాలో సైకిల్ జోరు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

సైకిల్ జోరు.. హుషారు.. తెలుగుదేశం పార్టీ సభ్యత్వాల నమోదులో ముందెన్నడూ లేని రీతిలో చరిత్ర సృష్టించింది. నియోజకవర్గాల వారీగా అత్యధిక పార్టీ సభ్యత్వాల నమోదును పూర్తిచేసింది. టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో పార్టీ సభ్యత్వాలను జోరుగా హుషారుగా చేపట్టి పూర్తి చేయడంతో పార్టీ వర్గాల్లో నూతనోత్తేజం నెలకొంది. గతంలో ఉన్న రికార్డులను సైతం బద్దలుకొట్టింది. ఉమ్మడి జిల్లా పరిధిలో ఉన్న తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ల్లోని 21 నియోజకవర్గాల్లో మొత్తం 45.16 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. వారిలో రికార్డు స్థాయిలో 9.97 లక్షల మంది తెలుగుదేశం పార్టీ సభ్యత్వం నమోదు చేయించుకున్నారు. టీడీపీ సభ్యత్వ నమోదులో ప్రవేశ పెట్టిన వినూత్న మార్పులు, ప్రమాద బీమా వంటి అంశాలపై ఈసారి ప్రజల్లోను, పార్టీ వర్గాల్లోను చైతన్యం పెరిగింది. దాంతో సభ్యత్వ నమోదులో గతం కంటే భిన్నంగా సభ్యులు మరింత ఉత్సాహంగా సభ్యత్వాలు నమోదు చేయించుకున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో అత్యధికంగా ఏడు నియోజకవర్గాలు కలిగిన తూర్పుగోదావరి జిల్లాలో 13.93 లక్షల మంది ఓటర్లు ఉండగా వారిలో 3.75 లక్షల మంది సభ్యత్వాలను పొంది ప్రథమస్థానంలో నిలిచారు. కోనసీమ జిల్లా ఏడు నియోజకవర్గాల పరిధిలో 15.12 లక్షల మంది ఓటర్లు ఉండగా 3.27 లక్షల మంది సభ్యత్వం నమోదు చేసుకుని ద్వితీయస్థానంలో ఉన్నారు. కాకినాడ జిల్లా ఏడు నియోజకవర్గాల్లో 16.10 లక్షల మంది ఓటర్లు ఉండగా 2.94 లక్షల మంది టీడీపీ సభ్యత్వం పొంది తృతీయ స్థానంలో నిలిచారు.

కోనసీమలో మండపేట టాప్..

కోనసీమ జిల్లా పరిధిలో అత్యధికంగా మండపేట నియోజకవర్గ పరిధిలో 2.16 లక్షల మంది ఓటర్లు ఉండగా వారిలో 57,765 మంది అత్యధికంగా టీడీపీ సభ్యత్వం తీసుకుని జిల్లాలో ప్రథమస్థానంలో నిలిచారు. అయితే ఇక్కడ టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిని నియమించకపోవడంతో పార్టీ సభ్యత్వ నమోదులో కొంచెం వెనుకబడ్డారు. ఇక కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రాతినిధ్యం వహించే రామచంద్రపురం నియోజకవర్గంలో లక్షా 99 వేల మంది ఓటర్లు ఉండగా వారిలో 57,442 మంది టీడీపీ సభ్యులుగా చేరి ద్వితీయస్థానం పొందారు. చివరి స్థానంలో రాజోలు రిజర్వుడు అసెంబ్లీ నియోజకవర్గం లక్షా 94 వేల మంది ఓటర్లు ఉండగా 22,414 మంది సభ్యత్వం తీసుకున్నారు. కొత్తపేట నియోజకవర్గంలో 2.49 లక్షల మంది ఓటర్లు ఉండగా వారిలో 56,520 మంది, అమలాపురం రిజర్వుడు నియోజకవర్గంలో 2.11 లక్షల మంది ఓటర్లు ఉండగా వారిలో 52,509 మంది, ముమ్మిడివరం నియోజకవర్గంలో 2.42 లక్షల మంది ఓటర్లు ఉండగా వారిలో 45,674 మంది, పి.గన్నవరం నియోజకవర్గంలో లక్షా 96 వేల మంది ఓటర్లు ఉండగా 34,843 మంది టీడీపీ సభ్యులుగా సభ్యత్వం పొందారు.

కాకినాడ జిల్లాలో ఇలా..

కాకినాడ రూరల్ నియోజకవర్గంలో అత్యధికంగా 53,915 మంది టీడీపీ సభ్యత్వం తీసుకున్నారు. కాకినాడ సిటీ 46,194, తుని 44,592, ప్రత్తిపాడు 43,370, పెద్దాపురం 40,655, జగ్గంపేట 34,681, పిఠాపురం 31,375 మంది టీడీపీ సభ్యత్వం తీసుకున్నారు. పిఠాపురం నియోజకవర్గం నుంచి జనసేన అధినేత పవన్‌కల్యాణ్ డిప్యూటీ సీఎం హోదాలో కొనసాగుతున్నారు.

తూర్పున... 'గోపాలపురం'

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

తూర్పుగోదావరి జిల్లాలో టీడీపీ బలం పెరిగింది. పార్టీ సభ్యత్వ నమోదు రికార్డు స్థాయిలో జరిగింది. గోపాలపురం ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గం లక్ష్యాన్ని మించి రికార్డు సాధించింది. జిల్లాలో మొత్తం 4.30 లక్షల మందిని చేర్పించాలని లక్ష్యం కాగా మొత్తం 3 లక్షల 62 వేల 634 మంది సభ్యులుగా చేరారు. రెన్యువల్ చేయించుకున్న వారు 1,44,773 మంది, కొత్తవాళ్లు 2,17,861 మంది ఉన్నారు. గోపాలపురం నియోజకవర్గంలో 60 వేలు సభ్యత్వ నమోదు లక్ష్యం కాగా మరో 4,375 అదనంగా చేసి ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు 107.29 శాతం సాధించారు. రెండో స్థానంలో అనపర్తి నిలిచింది. లక్ష్యం 55 వేలు కాగా 52,787 మంది 95.98 శాతం సభ్యులుగా చేరారు. ఇక్కడ బీజేపీ ఎమ్మెల్యేగా నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఉన్న సంగతి తెలిసిందే. ఆయన కుమారుడు ఎన్.మనోజ్‌రెడ్డి టీడీపీ ఇన్‌చార్జిగా ఉన్నారు. కొవ్వూరు మూడో స్థానంలో నిలిచింది. 60 వేల సభ్యత్వం లక్ష్యం కాగా 51,851 అంటే 86.42 శాతం మందిని చేర్పించారు. ఎమ్మెల్యే ముప్పిడి వేంకటేశ్వరరావు, పారిశ్రామికవేత్త పెండ్యాల అచ్చిబాబు, ద్విసభ్య కమిటీ సభ్యులు సభ్యత్వ నమోదుపై దృష్టి సారించారు. రాజానగరంలో 79.67 శాతం జరిగింది. రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు జరిగింది. లక్ష్యం 55 వేలు కాగా 43,820 మందిని చేర్పించారు. నిడదవోలులో 78.33 శాతం జరిగింది. లక్ష్యం 55 వేలు కాగా మాజీ ఎమ్మెల్యే శేషారావు 43,079 మందిని చేర్పించారు. రాజమహేంద్రవరం రూరల్‌లో 75 వేలు లక్ష్యం కాగా 55,485 మందిని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఆధ్వర్యంలో చేర్పించారు. రాజమహేంద్రవరం సిటీలో 70 వేల సభ్యత్వాలు లక్ష్యం కాగా 51,237 మందిని చేర్పించారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డివాసు ఆధ్వర్యంలో 73.98 శాతం సభ్యత్వ నమోదు జరిగింది.

కందుకూరు వీరేశలింగం గుర్తుండాలి

పర్యాటక అభివృద్ధికి కందుకూరి నివాసం - కలెక్టర్ ప్రశాంతి వెల్లడి

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : చారిత్రక సంపద కలిగిన కందుకూరి వీరేశలింగం పంతులు జన్మగృహాన్ని పర్యాటక ప్రదేశంగా అభివృద్ధి చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. రాజమహేంద్రవరం వంకాయల వారి వీధిలో ఉన్న కందుకూరి నివాసాన్ని నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్, ఆర్కియాలజీ సహాయ సంచాలకులు తిమ్మరాజుతో కలిసి శుక్రవారం పరిశీలించారు. చారిత్రక నేపథ్యం, వారసత్వ సంపద కలిగిన కందుకూరి వీరేశలింగం పంతులు జన్మగృహాన్ని ఇలా వదిలేయకూడదన్నారు.ఈ గృహం, ఆనాటి స్మృతులు చెక్కుచెదరకుండా ప్రజల సందర్శనార్థం ఉంచాలన్నారు.ఈ గృహాన్ని సందర్శించడానికి వచ్చే వారికి ఆనాటి ఘటనలు అద్దం పట్టే విధంగా త్రీడీ ఎఫెక్ట్‌తో కూడిన ఒక ఫిల్మ్ డాక్యుమెంటరీ సిద్ధం చేసి ప్రదర్శించాలన్నారు. జిల్లాలోని దర్శనీయ స్థలాలో కందుకూరి వీరేశలింగం పంతులు వారి జన్మగృహాన్ని చేర్చాలన్నారు.పర్యాటకులకు ఒక చక్కటి జ్ఞాపకంగా మిగిలేలా పనులు చేపట్టాలని సూచించారు. వితంతువు వివాహఘట్టం, సమావేశ మందిరం, సమాలోచన మందిరం, వివేకవర్ధిని పుస్తకం ముద్రణ యంత్రం, లైబ్రేరీ, నివాస ప్రాంతం ప్రదేశాలను కమిషనర్‌తో కలిసి నిశితంగా పరిశీలించారు.ఆమె వెంట కార్పొరేషన్ ఎస్ఈ జి.పాండురంగారావు,ఆర్ఎంసీ ఈఈ ఆలీ, మాధవీ ఇతర అధికారులు ఉన్నారు.



కందుకూరి వీరేశలింగం నివాసం పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, కమిషనర్ కేతన్‌గార్గ్

రాడ్‌బెండింగ్ కాంట్రాక్టర్ హత్య



రాజమహేంద్రవరం సిటీ, జనవరి 24(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో రాడ్ బెండింగ్ కాంట్రాక్టర్ కిలాని పోతురాజు (58)ని గుర్తుతెలియని వ్యక్తులు కత్తులతో పొడిచి దారుణంగా హత్యచేశారు.రాజమహేంద్రవరం రూరల్ కొంతమూరుకు చెందిన కిలాని పోతురాజు గతంలో వీరభద్రపురం చిన్నఆంజనేయస్వామి ఆలయ సమీపంలో కుటుంబంతో కలిసి నివాసం ఉండేవాడు. సుమారు 40 మంది కూలీలను పెట్టి రాడ్ బెండింగ్ వర్కులను పనులు చేయిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొద్ది నెలల కిందట కొంతమూరు గ్రామంలో సొంతిల్లు కట్టుకుని కుటుంబంతో సహా అక్కడకి మారారు.అయినా పనులన్నీ రాజమహేంద్రవరం లలితానగర్, వీరభద్రపురం నుంచే నిర్వహిస్తున్నాడు. ప్రతిరోజు సాయంత్రం వీరభద్రపురం దిగువన ఉన్న లలితానగర్ ప్రధాన రోడ్డు బోదీ స్కూల్ ఎదురుగా కార్నర్‌లో ఉన్న బెంచ్‌ల వద్ద కూర్చుని స్నేహితులతో మాట్లాడి అటుపై ఇంటికి వెళ్లిపోయేవాడు. శుక్రవారం రాత్రి 8:30 గంట సమయంలో మిత్రులతో మాట్లాడి అక్కడ నుంచి కొంత మూరు కాకుండా టౌన్ హైస్కూల్ రోడ్డులోకి వెళ్లిన క్రమంలో అతనిపై గుర్తుతెలియని వ్యక్తి వచ్చి కత్తితో దాడి చేసి పారిపోయాడు. స్థానికులు చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడు. సమాచారం అందడంతో త్రీటౌన్ సీఐ అప్పారావు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు.కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.హత్యకుగల కారణాలపై అన్వేషిస్తున్నారు.

జేఈఈ మెయిన్స్ పరీక్షకు 1752 మంది హాజరు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రాజీవ్‌గాంధీ విద్యాసంస్థల్లో జేఈఈ మెయిన్స్ పరీక్షకు 1752 మంది హాజరయ్యారని కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మూడో రోజు శుక్రవారం ఉదయం షిఫ్ట్ -1 పరీక్షలకు 885 మందికి 870 మంది హాజరయ్యారు. 15 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం షిఫ్ట్-2లో 886 మందికి 882 మంది పరీక్షలు రాశారు.నలుగురు గైర్హజరయ్యారని కలెక్టర్ ప్రశాంతి తెలిపారు.

నేడు పురందేశ్వరి పర్యటన

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి శనివారం రాజమహేంద్రవరం, కోరుకొండ మండలం కోటికేశవరం గ్రామాల్లో జరిగే కార్యక్రమాల్లో పాల్గొంటారు.ఈ మేరకు ఎంపీ కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదలైంది. ఉదయం 11 గంటలకు రాజమహేంద్రవరం జేఎన్ రోడ్డులో జరిగే ఎడ్యుకేషన్ అవేర్‌నెస్ ఎక్స్‌పో ప్రారంభోత్సవంలో పాల్గొంటారు. అనంతరం సంవిధాన్ గౌరవ్ దివస్ కార్యక్రమంలో భాగంగా కోరుకొండ మండలం కోటికేశవరంలో దళితవాడలో దళిత కుటుంబాలతో కలిసి సహపంక్తి భోజనం చేస్తారన్నారు.సాయంత్రం 5 నుంచి విద్యుత్ కాలనీలోని ఎంపీ కార్యాలయంలో అందుబాటులో ఉంటారన్నారు.

నేడు ఓటరు దినోత్సవం

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 24(ఆంధ్రజ్యోతి):రాజమహేంద్రవరంలో శనివారం 15వ జాతీయ ఓటరు దినోత్సవం నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు వై.జంక్షన్ నుంచి ఆనం కళాకేంద్రం వరకు 800 మంది విద్యార్థులు ర్యాలీ నిర్వహిస్తారు.అనంతరం 10:30 గంటలకు ఆనం కళాకేంద్రంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.ఈ మేరకు ఎస్‌కేవీటీ స్కూల్‌లో శుక్రవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు.




ఎయిర్‌పోర్ట్‌లో ప్రమాదం

రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్ట్‌లోని టెర్మినల్ పనుల్లో శుక్రవారం అపశ్రుతి చోటుచేసుకుంది. నిర్మాణంలో ఉన్న టెర్మినల్ ఒక్కసారిగా కూలడంతో ఇద్దరు గాయాలపాలయ్యారు. - మెయిన్‌లో

రేపు ఆర్ట్స్ కళాశాలలో గణతంత్ర వేడుక

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో గణతంత్ర దినోత్సవం వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాల నిర్వహణకు ఆర్ట్సకళాశాల గ్రౌండ్‌ను ముస్తాబు చేస్తున్నారు. ఈ మేరకు ఏర్పాట్లను ఆర్‌డీవో కృష్ణనాయక్ పరిశీలించారు. శుక్రవారం ఆయన ఆర్ట్సకళాశాల గ్రౌండ్స్‌కు చేరుకుని అక్కడ జరుగుతున్న పనులు పరిశీలించి సూచనలు చేశారు. వేదికను సుంద రంగా తీర్చిదిద్దాలన్నారు. పోలీస్ అధి కారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు.



బంగారం ధగధగలు

24 క్యారెట్లు 10 గ్రాములు రూ. 82,420

రాజమహేంద్రవరం, జనవరి 24 ఆంధ్రజ్యోతి : బంగారం ధగధగలాడుతోంది. ధర రోజురోజుకు పెరుగుతోంది. మార్కెట్ అంచనాల ప్రకారం ఆల్‌టైం రికార్డుగా చెబుతున్నారు.అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ బాధ్యతలు స్వీకరించడం, స్టాక్ మార్కెట్ నష్టాల్లో ఉండడంతో బంగారం ధర పెరుగుతున్నట్టు వ్యాపారులు చెబుతున్నారు. వచ్చేది మాఘ మాసం వివాహాలు ఎక్కువగా జరుగుతాయి. ఇటువంటి సమయంలో బంగారం ధరలు పెరగడంపై ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నెల 16వ తేదీన 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.73,900 ఉండగా ఇవాళ 75,550కు చేరింది. సుమారు వారంలో ఏకంగా రూ.1650లు పెరిగింది.ఇది ఆల్‌టైమ్ రికార్డుగా చెబుతున్నారు. మరింత పెరిగే అవకాశం ఉన్నట్టు మార్కెట్ కథనం. శుక్రవారం 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.82,420 ఉంది. ఇది రికార్డు..నిపుణులు రూ.లక్ష వరకూ పెరగవచ్చని అంచనా వేస్తున్నారు. వెండి కేజీ ధర రూ.93,700గా ఉంది.



ఇటీవల మార్కెట్‌లో కొనుగోళ్లు పెరుగుతున్నాయి. సంక్రాంతి పండగ సీజన్‌లో కళకళలాడిన బంగారం దుకాణాలు, మధ్యలో కొంత తగ్గినా రెండురోజుల నుంచి మళ్లీ కళకళలాడుతున్నాయి. దీంతో బంగారం కొనుగోలుదారులపై కొంత భారం పడుతున్నట్టే చెప్పాలి. ముందుగానే కొనుగోలు చేసి దాచుకున్నవారికి మాత్రం పెరుగుతున్న ధరలు సంతోషాన్నిస్తున్నాయి.

కోర్టు ఆర్డర్ ధిక్కరించిన ఏడుగురికి జైలు

నిడదవోలు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : కోర్టు ఆదేశాలను ధిక్కరించడంతో ఏడుగురికి జడ్జి 14 నెలల జైలు శిక్ష విధించారు. నిడదవోలు మండలం శంకరాపురం (రావిమెట్ల) గ్రామంలో 2016లో చదలవాడ రామకృష్ణ ఇంటి సరిహద్దు విషయమై నిడదవోలు సివిల్ జడ్జి కోర్టు ఇంజక్షన్ ఆర్డర్ ఇవ్వగా ఆ ఆర్డర్‌ను తిరస్కరించి ఫిర్యాదుదారుడు ఇంటి స్థలంలో ప్రవేశించి పైపులైను కొరకు బోదెను తవ్వగా సమిశ్రగూడెం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేయడం జరిగింది. దీనిపై శుక్రవారం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జి.రామకృష్ణ అందుకు సహకరించిన వీఆర్‌వో బసవా వెంకట సర్వేశ్వరరావు, చదలవాడ సూర్యారావు, పెంట నాగేశ్వరరావు, చదలవాడ రామకృష్ణ, చదలవాడ నాగమణి, జొన్నకూటి దావీదు, దూలపల్లి కోట సత్యవతి, రాపాక వెంకటేశ్వరరావులకు ఒక్కొక్కరికి 14 నెలల సాధారణ జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.5,700 జరిమానా విధించారు. వీరిలో చదలవాడ రామకృష్ణ మరణించగా మిగిలిన ఏడుగురికి శిక్ష ఖరారు చేసినట్టు సమిశ్రగూడెం పోలీసులు తెలిపారు. ఈ కేసులో ఏపీపీ జె.సింధు ప్రాసిక్యూషన్ తరపున వాదించారు.

టమాట విందుంది!

- భారీగా తగ్గిన ధర.. కేజీ రూ.13లే
- పడిపోయిన దొమ్మేరు వంకాయలు
- బెండ..దొండకాయలే బెటర్



రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరికీ ఒక రోజు వస్తుందనే సామెత.. కూరగాయల విషయం లోనూ వర్తించినట్టే కనబడుతోంది. ఎందుకంటే ధరల విషయంలో ఏనాడూ నేలచూపులు చూడని కొన్ని కూరగాయల ధరలు అనూ హ్యంగా పతనమైతే.. ధర అంతంతమాత్రంగా ఉండే కొన్ని రకాల ధరలు భారీగా పెరుగుతూ పైపైకి వెళ్లడం రైతులను, మార్కెట్ వర్గాలను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. కూరగాయాల్లో ప్రధానంగా రారాజుగా వెలిగే దొమ్మేరు వంకాయల ధర భారీగా పతనమైంది. రైతు బజార్లలో కిలో రూ.20లకు బహిరంగ మార్కెట్లో రూ.30-40లకు దొరుకుతుండడం విశేషం. దొమ్మేరు వంకాయలు కిలో రూ.50ల కంటే ధర తగ్గిన సందర్భాలు అరుదు. ఒక్కోసారి కిలో రూ.70-రూ.80 కూడా ధర ఉంటుంది. అలాంటిది చిత్రంగా దొమ్మేరు వంకాయల ధర పడిపోయింది. మరోపక్క చాలా తక్కువ ధరకే దొరికే బెండకాయలు, దొండకాయల ధరలు అమాంతం ఎగబాకాయి. రైతు బజార్లలోనే బెండకాయలు కిలో రూ.48, బీరకాయలు రూ.38, దొండకాయలు రూ.34 ధర ఉందంటే బహిరంగ మార్కెట్లో వీటి ధరలు ఎంత ఉంటాయో చెప్పనక్కరలేదు. టమోటా ధర పడిపోయింది. నెల రోజుల కిందట రూ.80-రూ.100లకు చేరిన టమోటా ధర అనూహ్యంగా దిగివచ్చింది. రైతు బజార్లలో కిలో రూ.13లకు, బహిరంగ చిల్లర మార్కెట్లలో రూ.15-రూ.20లకు విక్రయిస్తున్నారు. తక్కువ ధరలకే దొరికే ములక్కాడ, పొట్లకాయ, ఆనబకాయ వంటి ధరలు పెరిగిపోయాయి. రైతుబజార్లలో పొట్లకాయ ఒక్కటి రూ.20లు, ములక్కాడ రూ.10లు ధర ఉంది. ఆనబకాయ రూ.15లకు విక్రయిస్తున్నారు. బహిరంగ చిల్లర మార్కెట్లలో ఈ ధరలు మరింత ఎక్కువగా ఉంటాయి. ఈ పరిస్థితికి ప్రధానకారణం వాతావరణ మార్పులే అని రైతులు, వ్యాపారులు చెబుతున్నారు.



కూరగాయలపై వాతావరణం

వాతావరణ పరిస్థితులు వంకాయల దిగుబడికి పూర్తి అనుకూలంగా ఉండడం వల్ల దిగుబడులు గణనీయంగా పెరిగి మార్కెట్‌లో ధరలు పతనమయ్యాయని చెబుతున్నారు. లోకల్‌గా సీతానగరం, కడియం మండలాలు, దొమ్మేరు ప్రాంతం నుంచి వంకాయలు ఎక్కువగా మార్కెట్లకు వస్తున్నాయి. టమోటా పరిస్థితి కూడా ఇంతే. అయితే బెండకాయలు, దొండకాయల విషయంలో ప్రతికూల వాతావరణం కారణంగా దిగుబడులు తగ్గడంతో ధరలు పెరగడానికి కారణంగా పేర్కొంటున్నారు. అలాగే రాత్రిపూట చలి, మంచు ప్రభావంతో బెండకాయలకు వైరస్ సోకి దిగుబడులు పడిపోయినట్టు విశ్లేషిస్తున్నారు. ఏదేమైనా తగ్గేదేలే అంటూ మార్కెట్లో కింగ్‌లా ఉండే దొమ్మేరు రకం వంకాయల ధరలు గణనీయంగా పడిపోవడం వీటిని సాగు చేసే రైతుల్లో గుబులు పుట్టిస్తోంది.

కొబ్బరి.. అధరహో మరి!



పంట పండింది

ఎందుకీ పంట.. ఆ చెట్టు నేను చూడడం.. నా వంక ఆ చెట్టు చూడడం తప్ప లాభం లేదు.. కనీసం నిమ్మకాయలతో కూడా పోటీపడలేక పోతోంది.. ఇదీ నిన్నటి వరకూ కొబ్బరి రైతు ఆవేదన.. ఎందుకంటే నిన్న మొన్నటి వరకూ కొబ్బరికాయ రూ. 10లు దాటిన ఘటనలు లేవు.. అటువంటిది ఒక్కసారిగా రూ.20లు మేర పెరిగిపోయింది.. అంటే వెయ్యి కాయలు రూ.20 వేలు అనమాట.. దీంతో కొబ్బరి పంట పండిందని .. రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు..

- వెయ్యి కాయలు రూ. 16000
- రికార్డుస్థాయిలో కొబ్బరి ధరలు
- ఇతర రాష్ట్రాల్లో తగ్గిన దిగుబడి
- ఉభయ జిల్లాల్లో పెరిగిన దిగుబడి
- కుంభమేళాకు కోనసీమ కొబ్బరి
- భారీగా సాగుతున్న ఎగుమతులు



గండేరా వెయ్యి కాయలు రూ.20 వేలు

పచ్చికొబ్బరికాయలు వెయ్యింటికి రూ.16వేలు, కొత్తకాయలో కురిడీలు వెయ్యింటికి గండేరా రకం రూ.19 వేలు, గటగట రకం రూ.16వేలు పలుకుతుంది. కురిడీ కొబ్బరి మార్కె ట్‌లో గండేరా రకం వెయ్యికాయలకు రూ.20వేలు పలుకుతుంది. గతంలో ఎన్నడులేదని కొబ్బరిధరలు కొనసాగుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు.

అంబాజీపేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : కోనసీమ కొబ్బరి మార్కెట్‌కు మంచిరోజులు వచ్చాయి.. ఇప్పటి వరకూ పడుతూ లేస్తూ ఉన్న కొబ్బరి ధర అమాంతం పెరిగిపోయింది. అలా ఇలా కాదు.. గతంలో ఎన్నడూ లేని విధంగా రికార్డుస్థాయిలో ధరలు ఉండడంతో ఇటు రైతులు, అటు వ్యాపారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కొబ్బరి పండించే తమిళనాడు, కర్ణాటక, కేరళ వంటి రాష్ట్రాల్లో కొబ్బరి దిగుబడి తగ్గడంతో మన రాష్ట్రంలో కొబ్బరికి డిమాండ్ వచ్చింది.ఈ నేపథ్యంలో కొబ్బరి ధరలు ఊహించని రీతిలో పెరిగాయి.ఎగుమతులు ఊపందుకున్నాయి.ఇతర రాష్ట్రాల్లో కొబ్బరి దిగుబడులు తగ్గాయి.మన రాష్ట్రంలో కొబ్బరి దిగుబడులు పెరగడంతో మార్కెట్ ఊపందుకుంది.

కొబ్బరి రైతులకు తీపి కబురు..

గతంలో ఎకరా కొబ్బరితోటకు 300 నుంచి 400 కొబ్బరికాయలు మాత్రమే దిగుబడి వస్తే ప్రస్తుతం ఎకరాకు 700కు పైగా దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు. దీంతో పచ్చి కాయకు డిమాండ్ ఏర్పడింది. పాతముక్కుడు కాయను బిహార్, ఒడిషా వంటి రాష్ట్రాలకు భారీగా ఎగుమతులు అవుతున్నాయి.పచ్చికాయ వెయ్యింటికి రూ.15,500 నుంచి రూ.16 వేలు ఉండగా పాతకాయ వెయ్యింటికి రూ.16 వేల నుంచి రూ.16,500 వరకు ధర పలుకుతుంది. అదే గతేడాది సంక్రాంతికి రూ.9 వేలు ఉండగా ప్రస్తుతం ధర పెరుగుదలతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మహాశివరాత్రి సందర్భంగా ఆయా రాష్ట్రాలకు రోజు 40కు పైగా లారీలు ఎగుమతులు అవుతున్నట్టు వ్యాపారులు చెబుతున్నారు.మహారాష్ట్ర, రాజస్థాన్, మధ్యప్రదేశ్,చత్తీస్‌గఢ్,తెలంగాణ రాష్ట్రాలకు ఎగుమతులు జరుగుతున్నాయి.



కుంభమేళాకు కోనసీమ కొబ్బరి



ఉభయగోదావరి జిల్లాల నుంచి 100 నుంచి 120 లారీల వరకు కొబ్బరి ఎగుమతులు జరుగుతున్నాయి. ఇతర ప్రాంతాల నుంచి ఆర్డర్లు అధికంగా రావడంతో మరింత పెరిగే అవకాశాలు ఉన్నట్టు చెబుతున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ కేంద్రంగా జరుగుతున్న మహాకుంభమేళాకు కోనసీమ ప్రాం తం నుంచి కొబ్బరి ఎగుమతులు జరుగుతున్నాయి. కుంభమేళాకు వచ్చే భక్తులు నదీమాతకు కురిడీ కొబ్బరిని వినియోగిస్తున్న నేపథ్యంలో కురిడీ కొబ్బరికి డిమాండ్ ఏర్పడింది. సంక్రాంతి సీజన్ ముగియడంతో పాటు రానున్న మహాశివరాత్రి, శ్రీపంచమి, హోలీ, పెళ్ళిళ్ల సీజన్‌తో కొబ్బరిమార్కెట్‌లో ధరలు మరింత పెరిగే అవకాశాలున్నాయని వ్యాపార విశ్లేషకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం అటకలపై కొబ్బరి కాయ నిల్వ లేదని , డిమాండ్ తగినంతగా సరఫరా ఉండకపోవచ్చునని వ్యాపారులు వాపోతున్నారు.

మంచు.. ముసుగేసింది..

ఎక్కడ ఉన్నాం.. ఎటెళ్లిపోతున్నాం.. ఊటీలో ఉన్నామా..కొడైకెనాల్‌లో ఉన్నామా.. లేదంటే లంబసింగి వచ్చేశామా.. అన్నట్టు మంచు ముసుగేసింది.. శుక్రవారం ఉదయం 8 గంటలు దాటినా తెలవారలేదు.. సూరీడు బయటకు రాలేదు.. సూరీడు ఎక్కడా అని వెతుక్కోవాల్సి వచ్చింది.. కాసేపటికి కలలా మంచు కరిగిపోయింది.. అప్పుడు తెలిసింది.. మనం గోదావరి జిల్లాలోనే ఉన్నామని.. ఎందుకంటే శుక్రవారం రోడ్లు కూడా కనిపించనంతగా మంచు ముసుగేసింది.. కోనసీమ జిల్లా అంబాజీపేట, మామిడికుదురు, యానాం, అమలాపురం, మండపేట , తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు, చాగల్లు, కాకినాడ జిల్లా తొండంగి, ముమ్మడివరం మండలాల్లో ఇలా మంచు ముసుగేసింది.



అమలాపురంలో ..



మండపేట - తాపేశ్వరం రహదారిలో

ప్రకృతి గీసిన చిత్రం : యానాంలో గోదావరిపై కప్పేసిన పొగమంచు



దారినీ వదల : ఉదయం 8 గంటలకు యానాంలో జాతీయ రహదారిపై ఇలా



దారేది: కాకినాడ నగరంలో ఉదయం పూట కురుస్తున్న మంచు




అమలాపురం/మండపేట/మామిడికుదురు/యానాం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): తెలతెల్లవారే వేళ.. పచ్చని అందాలతో చూపరులను మంత్రముగ్ధులను చేసే తూర్పు గోదావరి జిల్లా మంచుపరదాల్లో మరిన్నీ సొబగులు అద్దుకుంది. మంచు తెరల మాటున పల్లెలు కొత్త అందాలను సంతరించుకున్నాయి. శుక్రవారం ఉదయం 9 గంటల తరువాత కూడా మంచు తెరలు తొలగలేదు. దీంతో వాహనాలకు లైట్లు వేసుకుని వెళ్లాల్సి వచ్చింది. విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు ఇబ్బందులు పడ్డారు. శీతాకాలం వచ్చిన తరువాత తొలిసారిగా శుక్రవారం మంచు తెరలు జిల్లాను కమ్మేశాయి. ముందెన్నడూలేని రీతిలో మంచు అనూహ్యంగా కురవడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మరికొంత మంది మంచు దృశ్యాలను తమ సెల్‌ఫోన్లలో బంధించేందుకు ఆసక్తి కనబరిచారు. మార్నింగ్ వాకింగ్ చేసేవారు ఆహ్లాదకరమైన వాతావరాన్ని ఆస్వాదిస్తు పొగమంచులో సెల్ఫీలు దిగారు. చాలా మంది మంచును ఆస్వాదించారు.. చాలా కాలం తరువాత మంచు ఇంత దట్టంగా కప్పేసిందని. ఇలా చాలా కాలమైందని గత జ్ఞాపకాల్లోకి వెళ్లారు.



మండపేటలో ఇలా..

తప్పని ఇక్కట్లు

ఉదయం 10 గంటల వరకు మంచు కమ్మేయడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఉష్ణోగ్రతలు కూడా బాగా తగ్గి 18 నుంచి 26 డిగ్రీల వరకు నమోదయ్యాయి. మంచుతో పాటు చలితీవ్రత పెరిగిపోవడంతో అందరూ మంకీ క్యాప్‌లు, జెర్కిన్లు, శాలువాలు ఉపయోగించాల్సిన పరిస్థితి నెలకొంది. వాతావరణం ఒక్కసారిగా మారిపోవడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. ముందు రోజు రాత్రి నుంచే చలి తీవ్రత బాగా పెరిగింది. ఉదయం నుంచి కోనసీమ ప్రాంతాన్ని మంచు దుప్పటి కప్పేసింది. గత రెండు నెలలతో పోలిస్తే శుక్రవారం కురిసిన మంచు చాలా ఎక్కువ అని నిపుణులు చెబుతున్నారు. ఈ మంచు బారిన పడితే అనారోగ్యాలకు గురి అవుతారని ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. మంచు తీవ్ర స్థాయిలో కురవడం వల్ల వ్యవసాయ పంటలతో పాటు ఆక్వారంగానికి నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. నీటిలో ఉష్ణోగ్రతలు పడిపోవడం వల్ల ఇబ్బందులు తలెత్తుతాయని వారి ఆందోళన. యానాం నియోజకవర్గాన్ని పొగమంచు కమ్మేసింది. పొగమంచు వల్ల వాహనదారులు ఇబ్బం దులకు గురయ్యారు.



మామిడికుదురులో కప్పేసిన మంచు

ఎన్నాళ్లకెన్నాళ్లకు : మామిడికుదురు గ్రామంలో దారిని కప్పేసిన మంచు



మంచు తెరల మధ్య మహాదేవుడు

మంచు తెరల మధ్య మహదేవుడి విగ్రహం భక్తులకు మహదానందాన్ని కలిగించింది, శుక్రవారం ఉదయం 9 గంటల వరకూ విపరీతమైన మంచుకురిసింది.ఏ కొత్తపల్లి కదంబ క్షేత్రంలో ఉన్న భువనేశ్వరి సహిత విజయేశ్వరుడి ఆలయంతో పాటు అక్కడి కోనేరులో కొలువైన మహదేవుడి విగ్రహం మంచు తెరల మధ్య నయనానందాన్ని కలిగించింది. **- తొండంగి**





చుండ్రు గోవిందరాజు

జాతీయ క్రీడలకు రాష్ట్ర ఒలింపిక్ సంఘ కార్యదర్శిగా గోవిందరాజుకు ఆహ్వానం

- 60 ఏళ్ల క్రీడా ప్రస్థానం

కాకినాడఅర్బన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడకు చెందిన వెటరన్ క్రీడాకారుడు, ఒలింపిక్ సంఘ రాష్ట్ర కార్యదర్శి చుండ్రు గోవిందరాజుకు అరుదైన అవకా శం దక్కింది. ఈనెల 27నుంచి ఫిబ్రవరి 14 వరకు ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని డెహ్రాడూన్‌లో జరిగే జాతీయ క్రీడల్లో ఒలింపిక్ సంఘ రాష్ట్ర సీఈవో హోదాలో పాల్గొనేం దుకు ఆహ్వానం అందింది. దీనికి సంబంధించిన వివరాలను శుక్రవారం మీడియాకు తెలిపారు మండపేటలో జన్మించిన ఆయన 50 ఏళ్లుగా కాకినాడలో నివసిస్తున్నారు. తన 16వ ఏట నుంచి క్రీడా జీవితాన్ని ప్రారంభించిన ఆయన 1969-70లో తొలిసారి ఆంధ్రా యూనివర్సిటీ తరపున ఇంటర్ యూనివర్సిటీ ఖోఖో పోటీల్లో పా ల్గొని పతకాలు సాధించారు. 30 ఏళ్లుగా బ్యాడ్మింటన్ క్రీడాకారుడిగా 10 జాతీయ, ఒక అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని వివిధ పతకాలు సాధించారు. ఒలింపిక్ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, సీఈవోగా జాతీయ క్రీడలకు ఈనెల 25న బయలుదేరి వెళుతున్న గోవిందరాజును ఒలింపిక్ సంఘ జిల్లా అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, కార్యదర్శి ఎలీషాబాబు, డీఎస్‌డీవో బి.శ్రీనివాసకుమార్, మాస్టర్స్ అథ్లెటిక్స్ జిల్లా అధ్యక్షుడు బి.కృష్ణమూర్తి అభినందించారు.

సత్రం గదుల కేటాయింపులో నిబంధనలు పాటించాలి: ఈవో

అన్నవరం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిధికి విచ్చేసే భక్తులకు సత్రంగదుల కేటాయింపులో నిబంధనలు తప్పనిసరిగా పాటించేవిధంగా చర్యలు తీసుకోవాలని ఈవో సర్క్యులర్ జారీచేశారు. సత్రంగదులవద్ద పనిచేసే సిబ్బంది డ్రెస్‌కోడ్, గుర్తింపుకార్డు తప్పనిసరిగా ధరించాలని సూచించారు. దళారీవ్యవస్థ అధికంగా ఉన్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని జాగ్రత్తగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే ఉద్యోగులపై చర్యలుతప్పవని హెచ్చరించారు.

నాటక రంగాన్ని బతికించుకోవాలి

- ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు
- ఉభయ తెలుగు రాష్ట్రాల నాటికల పోటీలు ప్రారంభం



రాష్ట్రస్థాయి నాటిక పోటీలను ప్రారంభిస్తున్న ముప్పన వీర్రాజు, ప్రముఖ వైద్యుడు లక్ష్మీనారాయణ

పెద్దాపురం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): నాటక రంగాన్ని బతికించుకోవాల్సిన అవసరం నేటి సమాజంపై ఎంతైనా ఉందని ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు, ప్రముఖ వైద్యుడు ఇందన లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని చంద్రమాంపల్లి గ్రామంలో స్నేహ ఆర్ట్స్ నాటక పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉభయ తెలుగు రాష్ట్రాల రాష్ట్రస్థాయి ఆహ్వాన నాటికల పోటీలను వారు శుక్రవారం ప్రా రంభించి మాట్లాడారు. మంచి సమాజాన్ని నిర్మించుకోవడానికి కళలు, నాటకాలు ఎంతో దోహదపడతాయన్నారు. నాటకం జీవితాన్ని ప్రతిభింబిస్తే, జీవితాన్ని నాటకంగా మన ముందు ఉంచుతుందన్నారు. మానవతా విలువలకు ప్రతిరూపమే నాటకాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో జీవన విధానాలను, సామాజిక సంబంధాలను నాటకాలు, కళారూపాల ద్వారా వ్యక్తపరిచాయన్నారు. నాటక పరిషత్‌ను క్రమం తప్పకుండా నిర్వహించాలని వారు నిర్వాహకులను కోరారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు కొత్తిం వెంకట శ్రీనివాసరావు (కోటి), గోపు నారాయణ మూర్తి, స్నేహ ఆర్ట్స్ అధ్యక్షుడు గొందేసి రాజా, ఇందన బ్రహ్మా నందం, కొత్తిం స్వామినాథన్ దేవాడ పాపేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఖరీదైన జైళ్లు నాటిక

కాళ్లు, చేతులు, కళ్లు, నోరు ఇలా అవయవాలే కాదు, అవి జంతువులకు కూడా ఉంటాయని. జంతువుల నుంచి మనిషిని వేరు చేసేది మనసు మాత్రమే అని, అది దేవుడు మనిషికి మాత్రమే ఇచ్చాడన్న ఇతివృత్తంతో సాగే ఖరీదైన జైళ్లు నాటిక ద్వారా కళ్లకు కట్టినట్లు చూపించారు ఈ నాటికను చైతన్య కళాభారతి (కరీంనగర్)వారు ప్రదర్శించ గా, మూలకథను పి.వెంకటేశ్వరరావు రచన చేశారు.

మంచి సందేశాన్నిచ్చిన అనూహ్యం నాటిక

తల్లిదండ్రుల వారసత్వ సంపదను, కష్టార్జితాన్ని కన్న కొడుకులు హక్కుల పేరుతో కుటిల నీతితో వ్యూహాత్మకంగా దక్కించుకోవాలని చూస్తున్నారని, కష్టపడి అభివృద్ధి చెందాల్సిన కొందరు కన్నబిడ్డలు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారన్న ఇతివృత్తంతో ప్రదర్శించిన అనూహ్యం నాటిక ఆహుతులను ఆకట్టుకుంది. తాళాబత్తుల వెంకటేశ్వరరావు రచనచేయగా కత్తుల మోహనరావు దర్శకత్వం వహించారు.

మన్యం కొండ జాతర ఏర్పాట్లపై సమావేశం

- పొల్లూరు జలపాతంను పరిశీలించిన ఒడిశా, ఆంధ్ర అధికారులు

మోతుగూడెం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో ఉన్న పొల్లూరు జలపాతంవద్ద మార్చి 3న జరగబోయే మన్యంకొండ జాతరకు ఏర్పాట్లుపై ఐటీడీఏ పీవో అపూర్వభరత్ జలపాతంవద్ద ప్రదేశాలను పరిశీలించారు. అనంతరం ఒడిశా నుంచి సుమారు 40వేల మంది భక్తులు జాతరకు వస్తారని ఒడిశా అధికారులు తెలపగా గత సంవత్సరం ఒడిశా అధికారులు సీలేరు నదిపై ఫ్లోటింగ్ బ్రిడ్జి ఏ ర్పాటుచేశారని ఈ సంవత్సరం కూడా ఏర్పాటు చేస్తారని చింతూరు తహసీల్దార్ చిరంజీవి, పంచాయతీ కార్యదర్శి జి.మోహ న్ ఐటీడీఏ పీవోకు తెలిపారు. ఒడిశా, ఆంధ్ర అధికారులు సమష్టిగా పనిచేద్దామని తెలిపారు. కార్యక్రమంలో ఒడిశా రాష్ట్రం కలిమిల తహసీల్దార్ రామకృష్ణ, సత్యరాజ్, మల్కన్‌గిరి తహసీల్దార్ టక్కున పుట్ట, మోటు తహసీల్దార్ ప్రభాస్‌కుమార్ బడ్నై క్, ఏబీడీవో కలిమెలా వసంత్ కుమార్ బొహరా, మల్కన్‌గిరి రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, మోతుగూడెం అధికారులు సాయిబాబా మాన్యో, ఫారెస్ట్ ఎఫ్ఎస్‌వో మోహన్, ఎస్ఐ శివనారాయణ, ఏపీజెన్‌కో సివిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వరప్రసాద్, ఏడీఈ కొండబాబు పాల్గొన్నారు.



పొల్లూరు జలపాతంను పరిశీలిస్తున్న ఆంధ్ర, ఒడిశా అధికారులు

కష్టాలు.. తీరేదెప్పుడో?


వాడపల్లిలో తిరువీధులలో భక్తుల రద్దీ(ఫైల్)

- వాడపల్లి వెంకన్న ఆలయం వద్ద భక్తులకు ఇక్కట్లు
- రోడ్లపై ఆక్రమణలు.. ఇరువైపులా చిరు వ్యాపారాలు
- ఆలయ తిరువీధుల్లో భక్తులకు తోపులాట కష్టాలు

ఆత్రేయపురం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం రాష్ట్రంలోనే ప్రసిద్ధి గాంచిన క్షేత్రంగా విరాజిల్లుతోంది. వివిధ రాష్ట్రాల నుంచి వేలాదిమంది భక్తులు స్వామివారిని దర్శించుకుంటున్నారు. కానీ, ఆలయంవద్ద కొన్ని ఇబ్బందులతో భక్తులకు ఇక్కట్లు తప్పడంలేదు. రోడ్డుపై ఆక్రమణలతో తిరువీధుల్లో ఒక్కోసారి తోపులాటలు లాంటి ఘటనలు జరుగుతున్నాయి.


వాడపల్లిలోని వెంకన్న ఆలయానికి పార్కింగ్ ప్రదేశంనుంచి వచ్చే రోడ్డు మార్గం దుకాణాలతో ఆక్రమించిన దృశ్యం

రోడ్డు మీదే వ్యాపారాలతో..

వాడపల్లి ఆలయంలో ప్రతి శనివారం 50వేల మంది భక్తులు ప్రదక్షిణలు నిర్వహించుకుని స్వామిని దర్శించుకుంటున్నారు. ఆలయం డిప్యూటీ కమిషనర్ హోదాస్థాయి పెరిగి రూ.25 కోట్లు వార్షిక ఆదాయానికి చేరుకుంది. అయినా భక్తులకు వసతి, సౌకర్యాలు అంతంతమాత్రంగా ఉంటున్నాయి. గతంలో టీడీపీ హయాంలో వాడపల్లివద్ద కొత్త వంతెన నిర్మించి పక్కా రహదారులను నిర్మించారు. రవాణా సౌకర్యం మెరుగుపర్చినా భక్తుల ట్రాఫిక్ కష్టా లు పెరిగిపోతున్నాయి. శ్రీనివాస ప్రాంగణంతోపాటు పుష్కరఘాట్‌వద్ద పార్కింగ్ సౌకర్యాలు ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోని వివిధ డిపోలనుంచి ఆర్టీసీ ద్వా రా భక్తులు స్వామి సన్నిధికి చేరుకుంటున్నారు. తిరువీధుల్లో భక్తుల ప్రదక్షిణలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అక్కడ చిరువ్యాపారులు రోడ్డు మీదే వ్యాపారాలు సాగించడంతో భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పార్కింగ్ ప్ర దేశంనుంచి ఆలయాలకు వెళ్లే రెండు దారులు, తిరువీధుల్లో నాలుగు మార్గాలవద్ద వ్యాపారాలు రోడ్డు మీదే ఏర్పాటు చేయడంతో భక్తులు అష్టకష్టాలు పడుతున్నారు. రాజకీయఒత్తిళ్లతో వ్యాపా రులను ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది. రహదారులపై ఇసుక, కంకర గుట్టలను నివాస గృహాల వారు నిల్వ చేసుకున్నారు. పుష్కరఘాట్‌కు వెళ్లే ప్రదేశం ఆక్రమణలతో బక్కచిక్కింది. పుష్కరఘాట్‌కు వెళ్లే మార్గంవద్ద మటన్, చికెన్‌షాపులు ఏర్పాటు చేయడంతో భక్తులు అసహనం వ్యక్తం చేస్తూ ముక్కుమూసుకుని వెళ్తున్నారు. మరి కొన్ని వీధుల్లో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. షాపుల వద్ద భక్తులు గుమిగూడడంతో ప్రదక్షిణ చేసేవారు మండిపడుతున్నారు. అసలే ఇరుకుప్రదేశం.. మరో పక్క రోడ్డు అక్రమణలు, భక్తుల రద్దీ పెరిగిపోవడంతో భక్తుల నగదు, బ్యాగులు, సెల్‌ఫోన్లు చోరీలకు గురవుతున్నాయి. భక్తుల ఇబ్బం దులను దేవదా యశాఖ పరిష్కరించాల్సి ఉంది. మెరుగైన సౌకర్యాలతోపాటు స్వామి దర్శనం సకాలంలో జరిగేలా చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.


వాడపల్లి పుష్కరఘాట్‌వద్ద స్నానాలు ఆచరించేందుకు వెళ్లే మార్గంవద్ద ఆక్రమణతోపాటు మాంసం దుకాణం విక్రయాలు

బెండపూడి విద్యార్థికి..
గవర్నర్ ఎట్‌హోంకు ఆహ్వానం


ఎట్‌హోంకు ఆహ్వానం పొందిన విద్యార్థి బలరాం శివ

- రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో సోలార్ పలకల ప్రాజెక్టు వ్యక్తిగత విభాగంలో ప్రథమస్థానం

తొండంగి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): బెండపూడి ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి బలరాం శివకు రాష్ట్ర గవర్నర్ కార్యాలయం నుంచి ఎట్‌హోం కార్యక్రమానికి ఆహ్వానం అందింది. రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో బలరాం రూపొందించిన సూర్యుడిని అనుసరించే సోలార్ పలకలు అనే ప్రాజెక్టు వ్యక్తిగత విభాగంలో ప్రథమస్థానాన్ని సాధించింది. ఇది దక్షిణ భారత దేశ విద్యావైజ్ఞానిక విభాగానికి ఎంపికైంది. ఈ నేపథ్యంలో రిపబ్లిక్ డే సందర్భంగా గవర్నర్ బంగ్లాలో వివిధ రంగాల ప్రముఖులకు ఇచ్చే విందులో శివ పాల్గొనే అరుదైన అవకాశాన్ని సొంతం చేసుకున్నాడు. ఈనెల 26న రిపబ్లిక్‌డే రోజున సాయంత్రం 4.30 గంటలకు జరిగే విందుకు హాజరు కావాల్సిందిగా గవర్నర్ కార్యాలయం నుంచి ఆహ్వానం అం దడంతో శివకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. తొండంగి ఎంఈవోలు షేక్ బాబ్జి, ఎ.సుబ్బిరెడ్డి, బెండపూడి గ్రామాభివృద్ధి కమిటీ ఛైర్మన్ సాధనాల నూకరాజు, విద్యా కమిటీ సభ్యులు అభినందించారు.

రిపబ్లిక్ డే వేడుకలకు ఆహ్వానం

- ఢిల్లీకి పయనమైన ఉమ్మడి జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు

కాకినాడ సిటీ, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఈనెల 26న ఢిల్లీలో జరగనున్న రిపబ్లిక్ డే వేడుకల్లో పాల్గొనేందుకు ఆహ్వానం అందడంతో కాకినాడకు చెందిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు బలసాడి రంగారావు, ఆయన సతీమణి బలసాడి లక్ష్మి శుక్రవారం బయలుదేరి వెళ్లారు. రోడ్డు మార్గం గుండా విశాఖ చేరుకుని అక్కడ మరో ఆరుగురు మత్స్యకార ప్రతినిధులతో కలిసి విమానంలో ఢిల్లీ వెళ్లారు. నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా వీరిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు బలసాడి రంగారావు మాట్లాడుతూ కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు సహకారంవల్లే తమను ఎంపిక చేశారని ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.


బలసాడి రంగారావు

మత్స్య సంపద దోపిడీ


గోదావరి నదిలో వేటాడిన చిన్న చేపలు

- గోదావరిలో అర్ధరాత్రి వలలతో చేపల వేట
- దేవీపట్నం నుంచి టన్నుల కొద్దీ లారీల్లో తరలింపు
- ఇతర ప్రాంతాల నుంచి వచ్చి దౌర్జన్యం
- ఆవేదన వ్యక్తం చేస్తున్న గిరిజన నిర్వాసితులు
- పట్టించుకోని అధికారులు

దేవీపట్నం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): దేవీపట్నం మండలంలో గోదావరి మత్స్య సంపద దోపిడీ జరుగుతోంది. దీన్ని పట్టించుకునేవారే కరువయ్యారు. మండలంలో కొందరు అక్రమంగా గోదావరిలో చేపలు వేటాడి గండిపోచమ్మ ఆలయం వద్దకు బోట్లపై తీసుకువస్తున్నారు. ఇక్కడినుంచి ట్రాక్టర్‌పై పురుషోత్తపట్నం తరలించి చిన్నచేప ప్యాకింగ్ చేసి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా..

ఏజెన్సీ ప్రాంతమైన దేవీపట్నం మండలంలో 44 గ్రామాల పరిధిలో పోలవరం ప్రాజెక్టు ఉన్న కారణంగా ప్రభుత్వ నిబంధనలు అమలులో ఉన్నాయి. అయినా ఇక్కడ సీడు-ఫీడు ధ్వంసం చేస్తూ ధనార్జన కోసం కొందరు అంతరాష్ట్ర వ్యాపారం చేస్తున్నారు. ఇక్కడి గ్రామాల్లో మత్స్యకారులు, గిరిజనులు వేట నియమాలు కలిగి ఉంటారు. ఆయా గ్రామాల్లో జీవనోపాధికి వీరు మాత్రమే వేట సాగించేందుకు అనుమతి ఉంది. దేవీపట్నం మండలం దేవారం, శరభవరం, ఇందుకూరు, ఇందుకూరుపేట, పోతవరం గ్రామపంచాయతీ పరిధిలో మత్స్యకారులు అద్దె ఇళ్లల్లో ఉంటూ తెల్లవారుజామున సంప్రదాయ వేటాడుతూ జీవనం సాగిస్తున్నారు. దీన్ని అదునుగా తీసుకుని కొందరు కొవ్వూరు, రాజమహేంద్రవరం, ధవళేశ్వరం, కాకినాడ, యానాం, నక్కపల్లి తదితర ప్రాంతాలనుంచి వచ్చి మత్స్యశాఖ నియమ, నిబంధనలకు వ్యతిరేకంగా చిన్న కన్నుల వలలతో చీరమేను అలివి వేటాడుతున్నారు. స్థానిక గిరిజనులు, మత్స్యకారులపై దౌర్జన్యం చేసి మరీ ఈ వేట సాగిస్తున్నారని విమర్శలున్నాయి. దీనిపై అధికారులు స్పందించకపోవడంపై పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రాత్రి సమయాల్లో వేట

అంతరాష్ట్ర ముఠాలతో స్థానికులు కొంతమంది కుమ్మక్కై ఈ వేట సాగిస్తున్నారని తెలుస్తోంది. అక్కడే గోదావరి పరీవాహక ప్రాంతాల్లో మకాం వేసుకుని రాత్రి సమయాల్లో గుట్టుచప్పుడు కాకుండా వేట సాగిస్తున్నారు. టన్నుల కొద్దీ చేపలను బోట్లపై గండిపోశమ్మ ఆలయం వద్దకు చేర్చి అక్కడినుంచి ట్రాక్టర్లపై పురుషోత్తపట్నం తరలిస్తున్నారు. అక్కడ ప్యాకింగ్ చేసి ఇతర ప్రాంతాలకు తరలించేస్తున్నట్లు తెలుస్తోంది. సీడు-ఫీడు గోదావరి గట్లపై పారవేస్తూ నదిలో మత్స్య సంపదను ధ్వంసం చేస్తున్నారు. కోట్ల రూపాయిల్లో ఈ వ్యాపారం జరుగుతున్నా మత్స్య సంపదను దోచుకుపోతున్నా అధికారులు పట్టనట్లు వ్యవహరించడంపై గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


నిబంధనలకు విరుద్ధంగా చేపలను ప్యాకింగ్ చేస్తున్న దృశ్యం

మహిళపై హత్యాయత్నం కేసులో
నిందితుడికి తొమ్మిదేళ్లు జైలు శిక్ష

సర్పవరం జంక్షన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మహిళను లైంగికంగా వేధించి హత్యాయత్నానికి పాల్పడిన నిందితునికి తొమ్మిది సంవత్సరాల జైలు శిక్షను విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చినట్లు సర్పవరం ఎస్‌హెచ్‌వో బొక్క పెద్దిరాజు తెలిపారు. కాకినాడ రూరల్ మండలం వాకలపూడికి చెందిన ఇరవై అయిదేళ్ల కొరుప్రోలు వెంకన్న స్థానికంగా ఉన్న మహిళను 2022వ సంవత్సరంలో లైంగికంగా వేధించి హత్యాయత్నానికి పాల్పడిన కేసులో అప్పటి మహిళా ఎస్ఐ వి మౌనిక కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారన్నారు. శుక్రవారం ఈ కేసు విషయమై వాదోపవాదనలు అనంతరం నిందితుడు వెంకన్నపై నేరం రుజువు కావడంతో రాజమహేంద్రవరం ఎనిమిదవ జిల్లా సెషన్స్ జడ్జి వై బెన్నయ్యనాయుడు 9 సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ తీర్పునివ్వడం జరిగిందన్నారు. రూ. 7 వేలు జరిమానా విధించడం జరిగిందన్నారు. నిందితునికి కోర్టులో శిక్షపడేలా కృషి చేసిన పీపీ కె రాధాకృష్ణరాజు బలమైన వాదనలు, కోర్టు కానిస్టేబుల్ ఏ దుర్గారావు సాక్షులను సక్రమంగా కోర్టులో ప్రవేశపెట్టడంతో నిందితునికి శిక్ష పడిందన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

అనపర్తి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : అనపర్తి దేవీచౌక్ సెంటర్ వద్ద గల సామర్లకోట కాలువలో శుక్రవారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. అనపర్తి అదనపు ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం ... బస్టాండ్ సమీపం ఎర్రకాలువలో గుర్తు తెలియని మృతదేహం ఉందన్న సమాచారం తమకు అందిందన్నారు. దీంతో అక్కడికి వెళ్లి మృతదేహాన్ని వెలికి తీయించామన్నారు. సుమారు 45 సంవత్సరాల వయసు కలిగిన పురుషుడిగా గుర్తించామన్నారు. మృతదేహం కుళ్లిన స్థితిలో ఉంద న్నారు. మృతుని వద్ద లభించిన దుస్తుల ఆధారంగా పరిసర పోలీస్ స్టేషన్లకు సమాచారం అందించినట్టు ఆయన చెప్పారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు. మృతుని ఆచూకీ తెలిసినవారు అనపర్తి పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

సారా స్థావరాలపై పోలీసుల దాడి .. మహిళ అరెస్ట్

రంగంపేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : రంగంపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధి వెంకన్నపేటలో శుక్రవారం ఎక్సైజ్ పోలీసులు సారా స్థావరాలపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఇందులో పంపన వీరగనిక అనే మహిళ ఐదు లీటర్ల సారా కలిగి ఉన్నట్టు గుర్తించారు. దీంతో సదరు మహిళను అరెస్ట్ చేసినట్టు ఎక్సైజ్ ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు. స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

గోకవరం పోలీస్ స్టేషన్ ఎదుట ..
పెంటపల్లి గ్రామస్థుల ధర్నా

- రోడ్డు ప్రమాదంలో చికిత్స పొందుతూ మృతి చెందిన యువకుడు
- బాధిత కుటుంబానికి న్యాయం చేయాలంటూ రోడ్డుపై బైఠాయించి నినాదాలు
- ఓ రాజకీయ నేత అడ్డుకుంటున్నాడని ఆరోపణ...
- ఎమ్మెల్యే నెహ్రూ హామీతో ఆందోళన విరమణ


ధర్నా చేస్తున్న పెంటపల్లి గ్రామస్థులు

గోకవరం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మృతుని కుటుంబానికి న్యాయం చేయాలంటూ పెంటపల్లి గ్రామస్థులు శుక్రవారం గోకవరం పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నాకు దిగారు. వివరాల్లోకి వెళ్తే.. పెంటపల్లి గ్రామానికి చెందిన సాత్నబోయిన దుర్గాప్రసాద్ (23)అనే యువకుడు కూలీ పనులు చేసుకుంటూ కుటుంబానికి అండగా ఉంటున్నాడు. ఈక్రమంలో ఈనెల 20వ తేదీన సినిమా చూసేందుకు టికెట్ల కోసం గోకవరం వెళ్లాడు. టికెట్లు తీసుకున్న అనంతరం స్నేహితుడిని కూడా సినిమాకు తీసికెళ్లేందుకు మోటారు సైకిల్‌పై బయలు దేరాడు. ఈ నేపథ్యంలో అతను ప్రయా ణిస్తున్న మోటారు సైకిల్ గోకవరం పంచాయతీ కార్యాలయం వద్దకు వచ్చేసరికి రాజమహేంద్రవరం వైపు నుంచి అతి వేగంగా వస్తున్న మరో మోటారు సైకిల్ ఢీకొనడంతో దుర్గాప్రసాద్ తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించగా, అదేరోజు సాయంత్రం మృతిచెందాడు. ఈ ఘటనపై గోకవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దీనికి కారణమైన వ్యక్తిని పోలీసులు గుర్తించినట్టు తెలిసింది. అయితే మృతుని కుటుంబానికి న్యాయం జరగ కుండా ఓ రాజకీయ పార్టీకి చెందిన నాయకుడు అడ్డుకుంటున్నారంటూ గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ప్రమాదానికి కారణమైన వ్యక్తిని ఇంతవరకు ఎందుకు అరెస్ట్ చేయలేదంటూ పోలీసులను ఆందోళనకారులు ప్రశ్నించారు. ఇంతలో స్థానిక ప్రభుత్వాసుపత్రి వద్దకు విచ్చేసిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను ఆందోళనకారులు కలిసి జరిగిన సంఘటనను వివరించారు. దీంతో ఎమ్మెల్యే స్పందించి మృతుని కుటుంబానికి ప్రభుత్వం నుంచి సాయం అందేలా కృషిచేస్తానని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు.

కోరుకొండ లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానంలో ..
ఎట్టకేలకు దిద్దుబాటు చర్యలు

- సిబ్బంది నిర్లక్ష్యంపై వచ్చిన ఆరోపణలపై స్పందించిన అన్నవరం దేవస్థానం ఈవో సుబ్బారావు

కోరుకొండ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): చారిత్రాత్మక కోరుకొండ లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానంలో పనిచేస్తున్న సిబ్బంది నిర్లక్ష్యంపై భక్తులు, గ్రామస్థుల నుంచి వస్తున్న ఆరోపణలపై ఎట్టకేలకు అన్నవరం దేవస్థానం కార్యనిర్వహణాధికారి (ఈవో) పి. సుబ్బారావు స్పందించారు. దీనికి సంబంధించి శుక్రవారం దిద్దుబాటు చర్యలు చేపట్టారు. ఈ మేరకు దశాబ్ద కాలంలో దేవస్థానంలో గుమస్తాగా విధులు నిర్వహిస్తున్న ఆర్.రవికుమార్‌ను ఆయన సొంత స్థానమైన రాజమహేంద్రవరం ఆర్యాపురం సత్యనారాయణ దేవస్థానం నుంచి బదిలీ చేశారు. అదేవిధంగా అన్నవరం దేవస్థానానికి చెందిన పి.వెంకటరమణ ఇప్పటి వరకు కోరుకొండ దేవస్థానం ఇన్‌చార్జిగా కొనసాగుతున్న ఆయన్ని ఇక్కడ నుంచి తిరిగి అన్నవరానికి బదిలీ చేశారు. ఆ స్థానంలో బి. సత్యశ్రీనివాస్, ఆర్.రవికుమార్ స్థానంలో టి.రాంజీని నియమించారు. దీనిపై అన్నవరం దేవస్థానం కార్యనిర్వహణాధికారి సుబ్బారావు లిఖితపూర్వక ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఇప్పటివరకు కోరుకొండ దేవస్థానంలో పనిచేస్తున్న రవికుమార్‌ను బదిలీ చేసి అన్నవరం దేవస్థానం నుంచి ఆ స్థానంలో సత్యశ్రీనివాస్, రాంజీను నియమించారు. అయితే అనేక అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఇద్దరు ఉద్యోగులను బదిలీ చేసి చేతులు దులుపుకుంటే సరిపోతుందా... అన్న అనుమానం స్థానికుల్లో ఉంది. దీనిపై లోతైన విచారణ జరిపి, చేసిన ఉద్యోగులకు కఠిన శిక్ష అమలు చేస్తేనే దేవస్థానంలో అభివృద్ధి జరుగుతుందని భక్తుల అభిమతం.

హత్య కేసులో .. నిందితుడికి జీవిత ఖైదు

రాజానగరం,జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఓ హత్య కేసుకు సంబంధించి నిందితుడికి జీవిత ఖైదు ఖరారైంది. వివరాలివి రాజానగరం పోలీస్‌స్టేషన్ పరిధిలో 2020వ సంవత్స రంలో హత్య కేసు నమోదైంది. ఈ మేరకు నిందితుడికి రాజమహేంద్రవరంలోని 5వ అదనపు కోర్టు జీవిత ఖైదు విధించినట్టు రాజానగరం సీఐ ఎస్.ప్రసన్న వీరయ్యగౌడ్ శుక్రవారం తెలిపారు. రాజానగరం మండలం రాధేయపాలేనికి చెందిన తన్నీరు రాంబాబు ఇదే గ్రామానికి చెందిన కొప్పిరెడ్డి వెంకన్నను హత్య చేయగా, తన్నీరు వెంకన్న బాబును గాయపర్చాడు. ఈ మేరకు అప్పటి సీఐ ఎంవీ సుబాస్ పర్యవేక్షణలో ఎస్ఐ నాగబాబు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేశారు.

అయితే ఎట్టకేలకు రాజమహేంద్రవరం 5వ అదనపు సెషన్స్ జడ్జి సమగ్ర విచా రణ జరిపిన అనంతరం జడ్జి డబ్బిరి విజయ్‌గౌతమ్ నిందితుడికి నేరం రుజువు కావడంతో జీవిత ఖైదు, రూ. ఐదు వేల జరిమానా విధించారు.

ఈ కేసులో ప్రాసి క్యూషన్ తరఫున అప్పటి అదనపు పీపీ శంభుప్రసాద్, పీపీ లక్ష్మణ్ నాయక్ బలమైన వాదనలు వినిపించారు.కోర్టు కానిస్టేబుల్ దుర్గాప్రసాద్ సాక్షులను సకాలంలో ప్రవేశపెట్టారు.

రాజమహేంద్రవరం

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి

నేడు లోకల్ సెలబ్రిటీ షో

రాజమహేంద్రవరం కల్చరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ భద్రమ్స్ ఫిల్మ్‌హౌస్ ఆధ్వర్యంలో లోకల్ సెలబ్రిటీ షో ఈ నెల 25వ తేదీ సాయంత్రం శ్రీ వెంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో నిర్వహిస్తున్నట్టు సినీ కమెడియన్ డాక్టర్ భద్రం చెప్పారు. తొలిసారిగా కళా సాంస్కృతిక కేంద్రమైన రాజమహేంద్రవరంలో ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. లోకల్ సెలబ్రిటీ షో ముఖ్యోద్దేశం గురించి చెప్పిన వెంటనే, మంత్రి కందుల దుర్గేష్ వెన్నుతట్టి ప్రోత్సహించి రాష్ట్రమంతటా నిర్వహించాలని సూచించారని, అలాగే నగర ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సహకారం అందిస్తానని చెప్పారన్నారు. ఈ సెలబ్రిటీ షోలో సభ్యత్వం తీసుకున్నవారికి వ్యయప్రయాసలు ఉండవన్నారు. ఈ అవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలని భద్రం కోరారు. సమావేశంలో గౌతమ్, శివ, ఫణి, సాయి, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ


ఉచితంగా కుట్టు మిషన్లు అందిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 24(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో లైట్ వే మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ఆరు నెలలు కుట్టు శిక్షణ పొందిన మహిళలకు శుక్రవారం ఉచితంగా కుట్టు మిషన్లు అందించారు. రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ఆదేశాల మేరకు ఈ పంపిణీ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బుడ్డిగ రాధా, బేసరి చిన్ని, లైట్‌వే మినిస్ట్రీస్ అధ్యక్షుడు సుకుమార్, ఎస్తేరు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఉచిత యోగా శిక్షణ శిబిరం

రాజమహేంద్రవరం రూరల్ జనవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని శాటిలైట్ సిటీలో పరిధిలో దుర్గా సెంటర్ సీ బ్లాక్‌లో ఉన్న జక్కంపూడి రామ్మోహనరావు కళ్యాణ మండపంలో ఉచిత యోగా శిక్షణా శిబిరం నిర్వహిస్తున్నట్టు సీనియర్ యోగా మాస్టారు టి.రాము తెలిపారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ నెల 26 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు ఈ శిబిరం నిర్వహించనున్నట్టు చెప్పారు. లయన్స్ క్లబ్ సహకారంతో నిర్వహిస్తున్న ఈ శిబిరంలో 8 సంవత్సరాలు దాటిన స్త్రీ, పురుషులు పాల్గొనవచ్చన్నారు.

ల్యాబ్ టెక్నీషియన్ ఆత్మహత్యాయత్నం

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 24(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న దేవి అనే మహిళ కుటుంబ కలహాలతో నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. వివరాల్లోకి వెళితే.. మూడేళ్లుగా ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న దేవి శుక్రవారం మధ్యాహ్నం ఆసుపత్రి ఆవరణలో నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. దీంతో అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను సిబ్బంది ఆసుపత్రిలోకి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగానే వుందని వైద్యులు తెలిపారు.

బెస్ట్ నర్సరీమెన్‌గా పోలరాజు


అవార్డు అందుకుంటున్న పోలరాజు

కడియం జనవరి 24(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తు వస్తున్న ఫలపుష్ప ప్రదర్శనలో అబ్బురపరిచే విధంగా స్టాల్స్‌ను ఏర్పాటు చేసిన శివంజనేయ నర్సరీ నిర్వాహకుడు మల్లు పోలరాజును బెస్ట్ నర్సరీమెన్‌గా ఆ ప్రభుత్వ హార్టీకల్చర్ జేడీ జగదీష్, డైరెక్టర్ డీఎస్ రమేష్ సత్కరించారు. అలాగే ఆ రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆదికవి వాల్మీకి మహర్షి అవార్డును పోలరాజు అందుకున్నారు.

క్షయ నివారణే ధ్యేయం

డాక్టర్ సిరాజుద్దీన్

నల్లజర్ల, జనవరి 24(ఆంధ్రజ్యోతి): క్షయ నివారణే ధ్యేయంగా పని చేద్దామని డాక్టర్ సిరాజుద్దీన్ పేర్కొన్నారు. శుక్రవారం నల్లజర్ల పీహెచ్‌సీలో క్షయ రోగులకు పోషకాహార కిట్లు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ క్షయ రోగులు క్రమం తప్పకుండా మందులు వాడడంతోపాటు పోషకాహారం తీసుకోవాలన్నారు. రీచ్ ప్రాజెక్ట్ సంస్థ క్షయ రోగులకు పోషకాహార కిట్లు ఇవ్వడం ఆనందదాయకమన్నారు. కార్యక్రమంలో రీచ్ ప్రాజెక్టు జిల్లా కో-ఆర్డినేటర్ వర్మ, ఉద్యోగుల సంఘం నాయకులు జీవీవీ ప్రసాద్, గంగ భవానీ, సత్యనారాయణ, షరీఫ్, నాగమణి పాల్గొన్నారు.

ఎస్‌టీపీ ప్లాంట్ పనులు వేగంగా పూర్తిచేయాలి

» జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి
» కమిషనర్ కేతన్‌గార్గ్‌తో కలిసి అభివృద్ధి పనుల పరిశీలన

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 24(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం పరిధిలో అమృత్ పథకంలో నిర్మిస్తున్న ఎస్‌టీపీ ప్లాంట్ పనులు వేగంగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. రాజమహేంద్రవరం నగర, రూరల్ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆమె పరిశీలించారు. శుక్రవారం రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్‌గార్గ్‌తో కలిసి వెంకట్రామయ్య నగర్‌లో నిర్మాణంలో ఉన్న ఇండోర్ స్టేడియంను, అమృత్ పథకంలో హుకుంపేట గ్రామంలో నిర్మిస్తున్న 50.60 ఎంఎల్‌డీ ఎస్‌టీపీ ప్లాంటు పనులను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వెంకట్రామయ్యనగర్‌లో నగరపాలక సంస్థ సాధారణ నిధులు రూ.3 కోట్లతో ప్రస్తుతం ఉన్న బ్యాడ్మింటన్ కోర్టు ఆవరణలో గ్రౌండ ఫ్లోర్, రెండు అంతస్తులుగా ఇన్‌డోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టారని ఇందులో చెస్, క్యారమ్స్, టేబుల్ టెన్నిస్ ఆటలు ఆడుకోవడానికి అన్ని ఏర్పాట్లతో పాటు జిమ్ ఎక్విప్‌మెంట్ ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఇప్పటికే 82శాతం పనులు పూర్తిచేశారని మిగిలినవి అతి త్వరలో పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే హుకుంపేటలో ప్రస్తుతం ఉన్న 30ఎల్ఎల్‌డీ సీవేజీ ట్రీట్‌మెంట్ ప్లాంట్ పనితీరును, లేబరేటరీలో ట్రీట్ చేస్తున్న నీటిని కలెక్టర్ పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న 30 ఎంఎల్‌డీ సీవేజీ ట్రీట్‌మెంట్ ప్లాంటు జనాభా అవసరాలకు సరిపోవడంలేదన్నారు. రాబోయే రోజుల్లో పెరిగే జనాభాను దృష్టిలో పెట్టుకుని అదనంగా 60 ఎంఎల్‌డీ ఎస్‌టీపీని రూ88.43 కోట్లతో నిర్మిస్తున్నామని, 50శాతం పనులు పూర్తయ్యాయని త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువస్తామని కమిషనర్ కేతన్ గార్గ్ వివరించారు. కార్యక్రమంలో ఎస్ఈ పాండురంగారావు ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికి రీసర్వే

గోపాలపురం, జనవరి 24(ఆంధ్రజ్యోతి) దీర్ఘకాలిక భూసమస్యల పరిష్కారానికి రీ సర్వే తోడ్పడుతుందని తహశీల్దార్ అజయ్ బాబు అన్నారు. మండలంలోని గుడ్డిగూడెం శుక్రవారం గ్రామంలో రీసర్వే నిర్వహిం చారు. ఈ సందర్భంగా 25 రైతులకు చెందిన 65ఎకరాల భూమిని రీసర్వే చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రక్తదానంతో మరొకరికి ప్రాణదానం చేయవచ్చని డ్రగ్స్ విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ డి.నాగమణి అన్నారు. శుక్రవారం జిల్లా డ్రగ్ ట్రేడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆలిండియా సంఘం 50 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా రాజమహేంద్రవరంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తదాతల నుంచి 160 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరావు, కార్యదర్శి పి.గణపతి, కోశాధికారి కె.శ్రీనివాసరావు, డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్లు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాల విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలు

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రిపబ్లిక్ డే సందర్భంగా రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, పోస్టర్ ప్రజంటేషన్ పోటీలు నిర్వహించారు. రాజనీతిశాస్త్ర విభాగం, చరిత్ర శాఖల సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థుల్లో దేశభక్తిని, రాజ్యాంగ స్ఫూర్తిని పెంపొందించడానికి ఈ పోటీలు నిర్వహించినట్టు రాజనీతిశాస్త్ర అధ్యాపకురాలు సయ్యద్ ఫరా ఎఫ్రూన్, చరిత్రశాఖ విభాగాధిపతి బి.అంజనికుమారి తెలిపారు. విజేతలకు ఈనెల 26న బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు. రాజనీతిశాస్త్ర విభాగాధిపతి పి.బాబ్జీ, అధ్యాపకులు పాల్గొన్నారు.

శ్రీకామేశ్వరరావుకు డాక్టరేట్

నిడదవోలు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): నిడదవోలులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల గణిత అధ్యాపకుడు ఎం.శ్రీకామేశ్వరరావుకు తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రకటించింది. సిగ్మా, రివర్స్ డైవర్షన్స్ ఇన్ రేంజర్స్ అనే ఆల్జీబ్రా అంశంపై సమర్పించిన పరిశోధనా గ్రంథానికి డాక్టరేట్ ప్రకటించినట్టు శ్రీకామేశ్వర రావు పేర్కొన్నారు.

బాలిక అదృశ్యం

కొవ్వూరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు సీఐ కె.శ్రీహరి తెలిపారు. కడియం మండలానికి చెందిన జి.వీర్రాజు భార్య తన ముగ్గురు పిల్లలతో సంక్రాంతికి ఈ నెల 12న అమ్మగారిల్లు కొవ్వూరు మండలం దేచర్ల వచ్చింది. 23న తిరిగి ఇంటికి ప్రయాణమయ్యారు. ఇంటి నుంచి బయటకు వెళ్లిన కుమార్తె కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

దావోస్ పర్యటన విజయవంతం

మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు



రాజమహేంద్రవరం సిటీ, జనవరి 24(ఆంధ్రజ్యోతి): తమ నాయకుడు సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ల దావోస్ పర్యటన విజయవంతం అయ్యిందని మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు ఆనందం వ్యక్తం చేసారు. ఈమేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఐదేళ్ల విధ్వంస పాలనకు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే వారు కూడా భయపడి ఆ ఆలోచన విరమించుకున్నారన్నారు. తమ నాయకుడు చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక పారిశ్రామికవేత్తలు పెట్టుబడులు పెట్టి రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు ముందుకు వస్తున్నారన్నారు. ఇదంతా అపార అనుభవ శాలి అయిన సీఎం చంద్రబాబు వల్లే సాధ్యమౌతుందని, ఇది రాష్ట్రానికి శుభపరిణామమని ఆదిరెడ్డి పేర్కొన్నారు.

ఆర్టీసీ అన్‌క్లెయిమ్డ్/అన్ ఐడెంటిఫైడ్ పార్సిల్స్ 29న వేలం

అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ మాధవ

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని ఆర్టీసీ పార్శిల్ బుకింగ్ కార్యాలయం వద్ద ఈనెల 29న బుధవారం అన్ క్లెయిమ్డ్/అన్ ఐడెంటీఫైడ్ పార్శిల్స్‌ను బహిరంగ వేలం నిర్వహించనున్నామని ఆర్టీసీ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ (కమర్షియల్) మాధవ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం పదిన్నర గంటలకు నిర్వహించే ఈ వేలంలో ఆసక్తి గల పాటదారులు పాల్గొనవచ్చని ఆయన కోరారు.

మార్కెట్‌లోకి కియా సిరోస్ కారు విడుదల


కియా సిరోస్ కారును మార్కెట్లోకి విడుదల చేస్తున్న డీటీవో సురేష్

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 24(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం కంటిపూడి కియా షోరూంలో కియా సిరోస్ ఎవోల్వ్ బైది ఫ్యూచర్ కారును మార్కెట్‌లోకి విడుదల చేశారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా రవాణాధికారి ఆర్.సురేష్ ముఖ్యఅతిథిగా విచ్చేసి కారును రాజమహేంద్రవరం మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా కంటిపూడి సీఈవో కామేష్ మాట్లాడుతూ ఈ కారు శక్తివంతమైన పెట్రోల్, డీజీల్ ఇంజిన్స్‌తో పాటు ఆటో అండ్ మాన్యువల్ ట్రాన్స్మిషన్, 16లెవెల్ 2 అడస్ ఫీచర్స్, 6 ఎయిర్ బ్యాగ్స్, డ్యూయల్ పానారోమిక్ సన్రూఫ్, 12.3 ఇంచ్ టచ్ స్క్రీన్ నావిగేషన్ కాక్పిట్, హర్మన్ కార్డన్ ప్రీమియం, 8 స్పీకర్స్ సౌండ్స్ సిస్టమ్‌తో కియా కనెక్ట్ 2.0 ఓటీఏ సాఫ్ట్వేర్ అప్డేట్స్ విత్ కియా రిమోట్ డయాగ్నోస్టిక్, స్మార్ట్ ఎయిర్ ప్యూరిఫయిర్ విత్ ఎక్యూఐ డిస్ప్లే, స్మార్ట్ డాష్ కామ్ విత్ డ్యూయల్ కెమెరాలతో అత్యాధునిక ఫీచర్స్‌తో కారు అందుబాటులో ఉందని తెలిపారు. కార్యక్రమంలో కంటిపూడి గ్రూప్స్ చైర్మన్ కంటిపూడి సర్వారాయుడు, మేనేజింగ్ డైరెక్టర్ కె.వినయ్‌బాబు, ఎం.జగన్, సీహెచ్ సత్యనారాయణ మూర్తి(చినబాబు), కె.మన్మోహన్‌రామ్, ఎస్ఎం కోమల, నగర ప్రముఖులు ,షోరూం సిబ్బంది పాల్గొన్నారు.

బిహార్ మాజీ సీఎం కర్పూరీ ఠాకూర్ జయంతి


ఠాకూర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం కల్చరల్/రూరల్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): అణగారిన వర్గాల ఆశాజ్యోతి, బీహార్ మాజీ ముఖ్యమంత్రి, భారతరత్న కర్పూరీ ఠాకూర్ జయంతి వేడుకలు శుక్రవారం రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరు పంచాయతీ పరిధిలోని శ్రీదేవినగర్ నాయీబ్రాహ్మణ సేవా సంఘం కాలనీలో మహాత్మా జ్యోతిరావు పూలే సేవా సంఘం అధ్యక్షుడు పెండ్యాల నాగబాబు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. బీజేపీ అసెంబ్లీ కోకన్వీనర్, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ యానాపు ఏసు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఎం.సూర్యనారాయణ మాట్లాడుతూ కర్పూరీ ఠాకూర్ కుల వృత్తి చేసుకుంటూ నిరాడంబరుడిగా, ప్రజానాయకుడిగా, బీహార్ ముఖ్యమంత్రిగా చిన్న వయసులోనే ఎదిగారన్నారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు పెండ్యాల నాగబాబు, కొరిపాటి రామకృష్ణ, బలగం కిరణ్, బందారు దుర్గారావు, పద్మ, ఉప్పాడి సూరిబాబు, మల్లువలస రాంబాబు, వై.మధు పాల్గొన్నారు.

పశు ఆరోగ్య శిబిరాలను వినియోగించుకోవాలి


పశువులకు వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్లు

దివాన్‌చెరువు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పాడిరైతులు పశు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పశు సంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎం. వెంకటేశ్వరరావు సూచించారు. రాజానగరం మండలం శ్రీకృష్ణపట్నంలో శుక్రవారం పశు ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఇందులో గొర్రెలు, మేకలు, గేదెలు, తదితర 158 పశువులకు వైద్యమందించినట్టు మండల పశువైద్యాధికారి డాక్టర్ ఎం.అరుణ తెలిపారు. డివిజన్ ప్రత్యేకాధికారి డాక్టర్ రాధాకృష్ణమూర్తి, పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ మూర్తి, స్థానిక టీడీపీ నాయకులు బత్తుల నాగేశ్వరరావు, దొడ్డా ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

ఫెస్పా ఆధ్వర్యంలో అన్నదానం

దివాన్‌చెరువు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కొండగుంటూరులోని వృద్ధాశ్రమంలో శుక్రవారం ఫెస్పా ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ విషయాన్ని ఉచిత విద్య విద్యార్థుల తల్లిదండ్రుల సంఘం (ఫెస్పా) అధ్యక్షుడు కొమ్ము సత్తిబాబు తెలిపారు. తమ సంఘం ఏర్పడేందుకు మూలకారకుడైన కే. అంబేద్కర్ జన్మదినం సందర్భంగా కార్యక్రమాన్ని నిర్వహించినట్టు ఆయన చెప్పారు. సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

30న సీతానగరం డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

సీతానగరం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): సీతానగరం డిగ్రీ కళాశాలలో ఈ నెల 30న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డా. చిట్టిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ జేకేసీ, వికాసా ఆధ్వర్యంలో జాబ్‌మేళా జరుగుతుందన్నారు. ఐసస్, ఎక్సాస్, టాటా, హ్యూందాయ్ కంపెనీల ప్రతినిధులు వివిధఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ అర్హత కలిగిన నిరుద్యోగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు విద్యార్థులు తమ బయోడేటా, సర్టిఫికెట్ జిరాక్సులతో హాజరుకావాలని సూచించారు.

డిగ్రీ కళాశాలలో నేతాజీ జయంతి


నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

సీతానగరం, జనవరి 24, (ఆంధ్రజ్యోతి): సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు, జాతీయ బాలికా దినోత్సవ కార్యక్రమాలను కళాశాల ప్రిన్సిపాల్ డా. చిట్టిబాబు ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో తెలుగు అధ్యాపకులు డా.ఎం ఉధామయి , ఆంగ్లోపన్యాసకులు వీవీ సుబ్బారావు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీలు

సీతానగరం, జనవరి 24, (ఆంధ్రజ్యోతి): బొబ్బిల్లంక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ చాటిన ఎం.లక్ష్మీప్రసన్న, ఎన్. జాన్‌వెస్లీ, జి.కనక విజేతలుగా నిలిచారు. అనంతరం వీరికి బహుమతులు అందించారు. హెచ్ఎం సత్యనారాయణ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుందరరావు, యు. రామకృష్ణ, ఎన్.వీరబాబు జీ. మాచరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రికి ఏసీ బహూకరణ


ఎమ్మెల్యే నెహ్రూ చేతుల మీదుగా ఏసీ అందజేస్తున్న దాతలు

గోకవరం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): గోకవరం ప్రభుత్వాసుపత్రిలో మౌలిక వసతుల కల్పనకు పలువురు దాతలు ముందుకొచ్చారు. దీనిలో భాగంగా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మెంబర్ రాయవరపు శ్రీనివాసరావు కుమారుడు శ్రీసాయి గౌతమ్ శుక్రవారం ఏసీని బహూకరించారు. స్థానిక ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ చేతుల మీదుగా ఆసుపత్రి నిర్వాహకులకు అందజేశారు.

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం

● నూతన బస్సు సర్వీసును ప్రారంభించిన ఎమ్మెల్యే నెహ్రూ


నూతన సర్వీసును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నెహ్రూ, రుడా చైర్మన్ వెంకట రమణ చౌదరి

గోకవరం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ అందిస్తున్న సేవలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. గోకవరం ఆర్టీసీ డిపో నుంచి కాకినాడకు నూతనంగా ఏర్పాటుచేసిన సర్వీసును శుక్రవారం రాజమహేంద్రవరం రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నెహ్రూ మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో సురక్షితమైన ప్రయాణాన్ని కొనసాగించవచ్చన్నారు. అనంతరం బస్సులో ఎమ్మెల్యే నెహ్రూ, రుడా చైర్మన్ వెంకట రమణచౌదరి తంటికొండ వెంకటేశ్వరస్వామి దేవస్థానం వరకు ప్రయాణించి స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, ఆర్టీసీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతుల అభివృద్ధే కూటమి లక్ష్యం

- బిక్కవోలు పీహెచ్‌సీ మాజీ చైర్మన్ సురేష్‌కుమార్ రెడ్డి


ఊలపల్లిలో దూడకు నట్టల నివారణ మందు వేస్తున్న సురేష్‌కుమార్‌రెడ్డి

బిక్కవోలు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పాడి రైతుల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని బిక్కవోలు పీహెచ్‌సీ మాజీ చైర్మన్ తొండాపు సురేష్‌కుమార్ రెడ్డి అన్నారు. ఊలపల్లిలో శుక్రవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పశువైద్యశిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు పాడి రైతులకు ఎన్నో పథకాలను అమలు చేస్తోందన్నారు. జిల్లా ప్రత్యేకాధికారి డాక్టర్ కె. రాధాకృష్ణమూర్తి పథకాల గురించి వివరించారు. శిబిరంలో 75 పశువులు, 35 దూడలకు నట్టల నివారణ మందు వేశారు. అనంతరం 60 మంది రైతులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నేతలు కాకర్ల అశోక్, బొడ్డు అర్జున్, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్. ఎం. వెంకటేశ్వరరావు, అనపర్తి ఏడీఏ వై. శ్రీనివాసరావు, మండల పశువైద్యాధికారి డీవీ ప్రణీత్, వైద్యులు రవికుమార్, వీర్రాజు, జేవీఓ సూర్యకుమారి, తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోటపాడులో కుట్టుశిక్షణ ప్రారంభం


కుట్టుశిక్షణకు హాజరైన మహిళలు

రంగంపేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కొత్తకోటపాడులో శుక్రవారం వినయ్ సుంకర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధినేత సుంకర వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇదే గ్రామంలో మగ్గం వర్క్ పెట్టామన్నారు. కుట్టు శిక్షణకు 60 మంది మహిళలు హాజరయ్యారు. ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ సుంకర వీరాస్వామి, సత్యనారాయణ, గంగాధర్, ఫౌండేషన్ సభ్యులు నాగమణి, మీనా, కుమారి, మౌనిక పాల్గొన్నారు. శిక్షకురాలిగా భవాని వ్యవహిస్తారన్నారు.

ప్రమాదకర మలుపు వద్ద లైట్ ఏర్పాటు


వడిశలేరు వద్ద ఏర్పాటు చేసిన లైట్

రంగంపేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న వడిశలేరు గ్రామ కార్గిల్ ఫ్యాక్టరీ ఎదురు ప్రమాద మలుపు వద్ద శుక్రవారం లైటును ఏర్పాటు చేశారు. ఏడీబీ రోడ్డు విస్తరణ పనులు చేపట్టిన బీఎస్ఆర్‌వారి సాయంతో దీన్ని బిగించినట్టు ఎస్ఐ తోట కృష్ణసాయి తెలిపారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలికా దినోత్సవం

సీతానగరం జనవరి 24, (ఆంధ్రజ్యోతి): చినకొండేపూడి జడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలకా దినోత్సవాన్ని నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పెద్దలక్ష్మి హాజరయ్యారు. అంగన్‌వాడీ వర్కర్లు ఎన్. సుభాషిణి, జేతు రాణి, శాంతి , సునీత ధనలక్ష్మి సీత పాల్గొన్నారు.

సిబ్బంది చొరవతోనే ఆసుపత్రికి గుర్తింపు

- అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి


అనపర్తి ఏరియా ఆసుపత్రిలో డిజిటల్ ఎక్స్‌రే యూనిట్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

అనపర్తి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : వైద్యులు ఎంత మంచి సేవలు అందించినా సిబ్బంది రోగుల పట్ల చూపే శ్రద్ధతోనే ఆసుపత్రికి మంచి పేరు వస్తుందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం అనపర్తిలోని ఏరియా ఆసుపత్రిలో ఎమ్మెల్యే అధ్యక్షతన హాస్పిటల్ సొసైటీ సమావేశాన్ని నిర్వహించారు. ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన డిజిటల్ ఎక్స్‌రే యూనిట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆసుపత్రి కమిటీలో నూతన సభ్యునిగా నియమితులైన మేడపాటి సత్యనారాయణరెడ్డి(అన్నవరం)ను ఎమ్మెల్యే సమక్షంలో ఆసుపత్రి వైద్యులు సత్కరించారు. అడిషనల్ డీఎంహెచ్‌వో వసుంధర, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తాడి రామగుర్రెడ్డి, అభివృద్ధి కమిటీ ప్రతినిధులు డాక్టర్ మల్లిడి కృష్ణారెడ్డి, రామారెడ్డి, గోదావరి తూర్పు డెల్టా కమిటీ వైస్ చైర్మన్ తమలంపూడి సుధాకరరెడ్డి, సిరసపల్లి నాగేశ్వరరావు, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, మామిడిశెట్టి శ్రీను, ఏరియా ఆసుపత్రి వైద్యులు ఆర్ఎమ్‌వో డాక్టర్ పద్మశ్రీ, అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ తరుణ్, డాక్టర్ రజని, వరలక్ష్మి, ఆనంద్, నర్సింగ్ సూపరింటెండెంట్ సరోజిని, ఏవో మాణిక్యాంబ, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డెక్కిన విద్యార్థుల తల్లిదండ్రులు

» ఎంపీపీ పాఠశాల సమీపంలో గుట్టలుగా పడేస్తున్న గోవ్యర్థాలు
» విద్యార్థులకు నిత్యం తప్పని అవస్థలు


పాఠశాల సమీపంలో ఇళ్లపై ఎండ బెట్టిన పశు చర్మాలు

గోకవరం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కామరాజుపేటలోని అంబేడ్కర్‌నగర్ కాలనీలో ఉన్న ఎంపీపీ పాఠశాల సమీపంలో పశు చర్మాలు, వ్యర్థాలను నిల్వ ఉంచడంతో విద్యార్థులు, స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. అయినప్పటికీ నిర్వాహకులు ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు శుక్రవారం పాఠశాల ఆవరణలో ఆందోళనకు దిగారు. పశు వ్యర్థాలను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. దీనిపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించాలని వారంతా కోరుతున్నారు.


చదవడం, రాయడం అవసరం


బిక్కవోలులో ఉల్లాస్ వలంటీర్లకు శిక్షణ ఇస్తున్న హెచ్ఎం నాగేంద్ర

బిక్కవోలు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): సమాజంలోని ప్రతిఒక్కరికీ చదవడం, రాయడం అవసరమని ఉల్లాస్ డీఆర్‌పీ నాగేంద్ర తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఉల్లాస్ వలంటీర్లకు ఒక రోజు శిక్షణ ఇచ్చారు. ఇందులో భాగంగా అందరికీ జీవితకాల అభ్యాసన, అవగాహన కల్పించడమే ఉల్లాస్ ముఖ్య ఉద్దేశమని ఆయన సూచించారు. మండలంలో 810 మంది నిరక్షరాస్యులను గుర్తించామని ఏపీఏ తణుకు సుప్రియ తెలిపారు. వీరికి చదువు చెప్పేందుకు తమ యానిమేటర్లు 71 మంది ముందుకు వచ్చారన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ జాన్‌మిల్టన్, ఎంఈఓ-2 పూర్ణచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభిప్రాయం మేరకే ఆర్చిలపై పేర్లు మార్పు : ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : అనపర్తి మండలంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో సంబంధం లేని పేర్లతో ఏర్పాటు చేసిన ఆర్చిలపై ప్రజాభిప్రాయం మేరకే మార్పులు చేస్తున్నామని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం అనపర్తి పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ వారా కుమారితో కలిసి ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా ఆర్చిల పేర్ల మార్పుపై వివరణ ఇచ్చారు. కార్యక్రమంలో కూటమి నాయకులు సిరసపల్లి నాగేశ్వరరావు, తమలంపూడి సుధాకరరెడ్డి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, కర్రి వెంకట రామారెడ్డి, వోగిరెడ్డి రాధ, తదితరులు పాల్గొన్నారు.



మంచు.. మసకేసిందిలే..

ప్రతి రోజూ ఉదయం సూరీడుని ఏం చూస్తారు.. నన్ను చూడండి అంటూ మంచుదుప్పటి కప్పేసింది.. పల్లెలు.. పట్టణాలను తన ఒడిలో దాచుకుంది.. శుక్రవారం ఉదయం 10 గంటలైనా వెలుతురు కానరాలేదు.. మంచు కప్పేసింది.. కాసేపటికి కలలా మంచు కరిగిపోయింది.. అంతే మెల్లమెల్లగా సూరీడు బయటకు వచ్చి వెలుగును ప్రసరింపజేశాడు.. ఇటువంటి వాతావరణం చూసి చాలాకాలం కావడంతో గోదావరి జిల్లాల్లో జనం పులకించిపోయారు.. షోయగాన్ని మనసారా ఆస్వాదించారు.. ఉదయం వాహనాలపై వెళ్లేవారు మాత్రం కాస్త ఇబ్బందులకు గురయ్యారు. 8



నిడదవోలు సమిశ్రగూడెం సెంటర్‌లో కమ్మేసిన మంచు

భళా..బాలిక





జాతీయ బాలికా దినోత్సవాన్ని రాజానగరం మండలం కానవరం గాయత్రి విద్యా సంస్థల్లో ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థినులు బాలిక, విద్య అనే అక్షర పదజాలం ఆకృతిలో ఆశీనులై ఆలోచింపజేశారు.. - రాజానగరం



మీతోనే!

సభ్యత్వంలోనూ చరిత్ర లిఖించెన్

- టీడీపీ వెంటే లక్షలాదిగా జనం
- సభ్యత్వ నమోదులో రికార్డు
- ఓటర్లు 45.16 లక్షలు
- టీడీపీ సభ్యులు 9.97 లక్షలు
- నియోజకవర్గానికి 50 వేలు
- గత రికార్డులు బద్దలు
- ఉత్సాహంగా టీడీపీ కేడర్
- ఉమ్మడి జిల్లాలో సైకిల్ జోరు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

సైకిల్ జోరు.. హుషారు.. తెలుగుదేశం పార్టీ సభ్యత్వాల నమోదులో ముందెన్నడూ లేని రీతిలో చరిత్ర సృష్టించింది. నియోజకవర్గాల వారీగా అత్యధిక పార్టీ సభ్యత్వాల నమోదును పూర్తిచేసింది. టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో పార్టీ సభ్యత్వాలను జోరుగా హుషారుగా చేపట్టి పూర్తి చేయడంతో పార్టీ వర్గాల్లో నూతనోత్తేజం నెలకొంది. గతంలో ఉన్న రికార్డులను సైతం బద్దలుకొట్టింది. ఉమ్మడి జిల్లా పరిధిలో ఉన్న తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ల్లోని 21 నియోజకవర్గాల్లో మొత్తం 45.16 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. వారిలో రికార్డు స్థాయిలో 9.97 లక్షల మంది తెలుగుదేశం పార్టీ సభ్యత్వం నమోదు చేయించుకున్నారు. టీడీపీ సభ్యత్వ నమోదులో ప్రవేశ పెట్టిన వినూత్న మార్పులు, ప్రమాద బీమా వంటి అంశాలపై ఈసారి ప్రజల్లోను, పార్టీ వర్గాల్లోను చైతన్యం పెరిగింది. దాంతో సభ్యత్వ నమోదులో గతం కంటే భిన్నంగా సభ్యులు మరింత ఉత్సాహంగా సభ్యత్వాలు నమోదు చేయించుకున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో అత్యధికంగా ఏడు నియోజకవర్గాలు కలిగిన తూర్పుగోదావరి జిల్లాలో 13.93 లక్షల మంది ఓటర్లు ఉండగా వారిలో 3.75 లక్షల మంది సభ్యత్వాలను పొంది ప్రథమస్థానంలో నిలిచారు. కోనసీమ జిల్లా ఏడు నియోజకవర్గాల పరిధిలో 15.12 లక్షల మంది ఓటర్లు ఉండగా 3.27 లక్షల మంది సభ్యత్వం నమోదు చేసుకుని ద్వితీయస్థానంలో ఉన్నారు. కాకినాడ జిల్లా ఏడు నియోజకవర్గాల్లో 16.10 లక్షల మంది ఓటర్లు ఉండగా 2.94 లక్షల మంది టీడీపీ సభ్యత్వం పొంది తృతీయ స్థానంలో నిలిచారు.

కోనసీమలో మండపేట టాప్..

కోనసీమ జిల్లా పరిధిలో అత్యధికంగా మండపేట నియోజకవర్గ పరిధిలో 2.16 లక్షల మంది ఓటర్లు ఉండగా వారిలో 57,765 మంది అత్యధికంగా టీడీపీ సభ్యత్వం తీసుకుని జిల్లాలో ప్రథమస్థానంలో నిలిచారు. అయితే ఇక్కడ టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిని నియమించకపోవడంతో పార్టీ సభ్యత్వ నమోదులో కొంచెం వెనుకబడ్డారు. ఇక కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రాతినిధ్యం వహించే రామచంద్రపురం నియోజకవర్గంలో లక్షా 99 వేల మంది ఓటర్లు ఉండగా వారిలో 57,442 మంది టీడీపీ సభ్యులుగా చేరి ద్వితీయస్థానం పొందారు. చివరి స్థానంలో రాజోలు రిజర్వుడు అసెంబ్లీ నియోజకవర్గం లక్షా 94 వేల మంది ఓటర్లు ఉండగా 22,414 మంది సభ్యత్వం తీసుకున్నారు. కొత్తపేట నియోజకవర్గంలో 2.49 లక్షల మంది ఓటర్లు ఉండగా వారిలో 56,520 మంది, అమలాపురం రిజర్వుడు నియోజకవర్గంలో 2.11 లక్షల మంది ఓటర్లు ఉండగా వారిలో 52,509 మంది, ముమ్మిడివరం నియోజకవర్గంలో 2.42 లక్షల మంది ఓటర్లు ఉండగా వారిలో 45,674 మంది, పి.గన్నవరం నియోజకవర్గంలో లక్షా 96 వేల మంది ఓటర్లు ఉండగా 34,843 మంది టీడీపీ సభ్యులుగా సభ్యత్వం పొందారు.

కాకినాడ జిల్లాలో ఇలా..

కాకినాడ రూరల్ నియోజకవర్గంలో అత్యధికంగా 53,915 మంది టీడీపీ సభ్యత్వం తీసుకున్నారు. కాకినాడ సిటీ 46,194, తుని 44,592, ప్రత్తిపాడు 43,370, పెద్దాపురం 40,655, జగ్గంపేట 34,681, పిఠాపురం 31,375 మంది టీడీపీ సభ్యత్వం తీసుకున్నారు. పిఠాపురం నియోజకవర్గం నుంచి జనసేన అధినేత పవన్‌కల్యాణ్ డిప్యూటీ సీఎం హోదాలో కొనసాగుతున్నారు.

తూర్పున... 'గోపాలపురం'

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

తూర్పుగోదావరి జిల్లాలో టీడీపీ బలం పెరిగింది. పార్టీ సభ్యత్వ నమోదు రికార్డు స్థాయిలో జరిగింది. గోపాలపురం ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గం లక్ష్యాన్ని మించి రికార్డు సాధించింది. జిల్లాలో మొత్తం 4.30 లక్షల మందిని చేర్పించాలని లక్ష్యం కాగా మొత్తం 3 లక్షల 62 వేల 634 మంది సభ్యులుగా చేరారు. రెన్యువల్ చేయించుకున్న వారు 1,44,773 మంది, కొత్తవాళ్లు 2,17,861 మంది ఉన్నారు. గోపాలపురం నియోజకవర్గంలో 60 వేలు సభ్యత్వ నమోదు లక్ష్యం కాగా మరో 4,375 అదనంగా చేసి ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు 107.29 శాతం సాధించారు. రెండో స్థానంలో అనపర్తి నిలిచింది. లక్ష్యం 55 వేలు కాగా 52,787 మంది 95.98 శాతం సభ్యులుగా చేరారు. ఇక్కడ బీజేపీ ఎమ్మెల్యేగా నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఉన్న సంగతి తెలిసిందే. ఆయన కుమారుడు ఎస్.మనోజ్‌రెడ్డి టీడీపీ ఇన్‌చార్జిగా ఉన్నారు. కొవ్వూరు మూడో స్థానంలో నిలిచింది. 60 వేల సభ్యత్వం లక్ష్యం కాగా 51,851 అంటే 86.42 శాతం మందిని చేర్పించారు. ఎమ్మెల్యే ముప్పిడి వేంకటేశ్వరరావు, పారిశ్రామికవేత్త పెండ్యాల అచ్చిబాబు, ద్విసభ్య కమిటీ సభ్యులు సభ్యత్వ నమోదుపై దృష్టి సారించారు. రాజానగరంలో 79.67 శాతం జరిగింది. రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు జరిగింది. లక్ష్యం 55 వేలు కాగా 43,820 మందిని చేర్పించారు. నిడదవోలులో 78.33 శాతం జరిగింది. లక్ష్యం 55 వేలు కాగా మాజీ ఎమ్మెల్యే శేషారావు 43,079 మందిని చేర్పించారు. రాజమహేంద్రవరం రూరల్‌లో 75 వేలు లక్ష్యం కాగా 55,485 మందిని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఆధ్వర్యంలో చేర్పించారు. రాజమహేంద్రవరం సిటీలో 70 వేల సభ్యత్వాలు లక్ష్యం కాగా 51,237 మందిని చేర్పించారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డివాసు ఆధ్వర్యంలో 73.98 శాతం సభ్యత్వ నమోదు జరిగింది.

కందుకూరు వీరేశలింగం గుర్తుండాలి

పర్యాటక అభివృద్ధికి కందుకూరి నివాసం - కలెక్టర్ ప్రశాంతి వెల్లడి



కందుకూరి వీరేశలింగం నివాసం పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, కమిషనర్ కేతన్‌గార్గ్

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : చారిత్రక సంపద కలిగిన కందుకూరి వీరేశలింగం పంతులు జన్మగృహాన్ని పర్యాటక ప్రదేశంగా అభివృద్ధి చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. రాజమహేంద్రవరం వంకాయల వారి వీధిలో ఉన్న కందుకూరి నివాసాన్ని నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్, ఆర్కియాలజీ సహాయ సంచాలకులు తిమ్మరాజుతో కలిసి శుక్రవారం పరిశీలించారు. చారిత్రక నేపథ్యం, వారసత్వ సంపద కలిగిన కందుకూరి వీరేశలింగం పంతులు జన్మగృహాన్ని ఇలా వదిలేయకూడదన్నారు.ఈ గృహం, ఆనాటి స్మృతులు చెక్కుచెదరకుండా ప్రజల సందర్శనార్థం ఉంచాలన్నారు.ఈ గృహాన్ని సందర్శించడానికి వచ్చే వారికి ఆనాటి ఘటనలు అద్దం పట్టే విధంగా త్రీడి ఎఫెక్ట్‌తో కూడిన ఒక ఫిల్మ్ డాక్యుమెంటరీ సిద్ధం చేసి ప్రదర్శించాలన్నారు. జిల్లాలోని దర్శనీయ స్థలాలో కందుకూరి వీరేశలింగం పంతులు వారి జన్మగృహాన్ని చేర్చాలన్నారు.పర్యాటకులకు ఒక చక్కటి జ్ఞాపకంగా మిగిలేలా పనులు చేపట్టాలని సూచించారు. వితంతువు వివాహఘట్టం, సమావేశ మందిరం, సమాలోచన మందిరం, వివేకవర్థిని పుస్తకం ముద్రణ యంత్రం, లైబ్రేరీ, నివాస ప్రాంతం ప్రదేశాలను కమిషనర్‌తో కలిసి నిశితంగా పరిశీలించారు.ఆమె వెంట కార్పొరేషన్ ఎస్ఈ జి.పాండురంగారావు,ఆర్ఎంసీ ఈఈ ఆలీ, మాధవీ ఇతర అధికారులు ఉన్నారు.

రాడ్‌బెండింగ్ కాంట్రాక్టర్ హత్య



రాజమహేంద్రవరం సిటీ, జనవరి 24(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో రాడ్ బెండింగ్ కాంట్రాక్టర్ కిలాని పోతురాజు (58)ని గుర్తుతెలియని వ్యక్తులు కత్తులతో పొడిచి దారుణంగా హత్యచేశారు.రాజమహేంద్రవరం రూరల్ కొంతమూరుకు చెందిన కిలాని పోతురాజు గతంలో వీరభద్రపురం చిన్నఆంజనేయస్వామి ఆలయ సమీపంలో కుటుంబంతో కలిసి నివాసం ఉండేవాడు. సుమారు 40 మంది కూలీలను పెట్టి రాడ్ బెండింగ్ వర్కులను పనులు చేయిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొద్ది నెలల కిందట కొంతమూరు గ్రామంలో సొంతిల్లు కట్టుకుని కుటుంబంతో సహా అక్కడకి మారారు.అయినా పనులన్నీ రాజమహేంద్రవరం లలితానగర్, వీరభద్రపురం నుంచే నిర్వహిస్తున్నాడు. ప్రతిరోజు సాయంత్రం వీరభద్రపురం దిగువన ఉన్న లలితానగర్ ప్రధాన రోడ్డు బోధి స్కూల్ ఎదురుగా కార్నర్‌లో ఉన్న బెంచ్‌ల వద్ద కూర్చుని స్నేహితులతో మాట్లాడి అటుపై ఇంటికి వెళ్లిపోయేవాడు. శుక్రవారం రాత్రి 8:30 గంట సమయంలో మిత్రులతో మాట్లాడి అక్కడ నుంచి కొంతమూరు కాకుండా టౌన్ హైస్కూల్ రోడ్డులోకి వెళ్లిన క్రమంలో అతనిపై గుర్తుతెలియని వ్యక్తి వచ్చి కత్తితో దాడి చేసి పారిపోయాడు. స్థానికులు చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడు. సమాచారం అందడంతో త్రీటౌన్ సీఐ అప్పారావు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు.కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.హత్యకుగల కారణాలపై అన్వేషిస్తున్నారు.

జేఈఈ మెయిన్స్ పరీక్షకు 1752 మంది హాజరు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రాజీవ్‌గాంధీ విద్యాసంస్థల్లో జేఈఈ మెయిన్స్ పరీక్షకు 1752 మంది హాజరయ్యారని కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మూడో రోజు శుక్రవారం ఉదయం షిఫ్ట్ -1 పరీక్షలకు 885 మందికి 870 మంది హాజరయ్యారు. 15 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం షిఫ్ట్-2లో 886 మందికి 882 మంది పరీక్షలు రాశారు.నలుగురు గైర్హజరయ్యారని కలెక్టర్ ప్రశాంతి తెలిపారు.

నేడు పురందేశ్వరి పర్యటన

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి శనివారం రాజమహేంద్రవరం, కోరుకొండ మండలం కోటికేశవరం గ్రామాల్లో జరిగే కార్యక్రమాల్లో పాల్గొంటారు.ఈ మేరకు ఎంపీ కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదలైంది. ఉదయం 11 గంటలకు రాజమహేంద్రవరం జేఎన్ రోడ్డులో జరిగే ఎడ్యుకేషన్ అవేర్‌నెస్ ఎక్స్‌పో ప్రారంభోత్సవంలో పాల్గొంటారు. అనంతరం సంవిధాన్ గౌరవ్ దివస్ కార్యక్రమంలో భాగంగా కోరుకొండ మండలం కోటికేశవరంలో దళితవాడలో దళిత కుటుంబాలతో కలిసి సహపంక్తి భోజనం చేస్తారన్నారు.సాయంత్రం 5 నుంచి విద్యుత్ కాలనీలోని ఎంపీ కార్యాలయంలో అందుబాటులో ఉంటారన్నారు.

నేడు ఓటరు దినోత్సవం

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 24(ఆంధ్రజ్యోతి):రాజమహేంద్రవరంలో శనివారం 15వ జాతీయ ఓటరు దినోత్సవం నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు వై.జంక్షన్ నుంచి ఆనం కళా కేంద్రం వరకు 800 మంది విద్యార్థులు ర్యాలీ నిర్వహిస్తారు.అనంతరం 10:30 గంటలకు ఆనం కళాకేంద్రంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.ఈ మేరకు ఎస్‌కేవీటీ స్కూల్‌లో శుక్రవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు.



ఎయిర్‌పోర్ట్‌లో ప్రమాదం

రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్ట్‌లోని టెర్మినల్ పనుల్లో శుక్రవారం అపశ్రుతి చోటుచేసుకుంది. నిర్మాణంలో ఉన్న టెర్మినల్ ఒక్కసారిగా కూలడంతో ఇద్దరు గాయాలపాలయ్యారు. - మెయిన్‌లో

రేపు ఆర్ట్స్ కళాశాలలో గణతంత్ర వేడుక



రాజమహేంద్రవరం సిటీ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో గణతంత్ర దినోత్సవం వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాల నిర్వహణకు ఆర్ట్స్‌కళాశాల గ్రౌండ్‌ను ముస్తాబు చేస్తున్నారు. ఈ మేరకు ఏర్పాట్లను ఆర్డీవో కృష్ణనాయక్ పరిశీలించారు. శుక్రవారం ఆయన ఆర్ట్స్‌కళాశాల గ్రౌండ్స్‌కు చేరుకుని అక్కడ జరుగుతున్న పనులు పరిశీలించి సూచనలు చేశారు. వేదికను సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. పోలీస్ అధి కారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు.

బంగారం ధగధగలు

24 క్యారెట్లు 10 గ్రాములు రూ. 82,420



రాజమహేంద్రవరం, జనవరి 24 ఆంధ్రజ్యోతి : బంగారం ధగధగలాడుతోంది. ధర రోజురోజుకు పెరుగుతోంది. మార్కెట్ అంచనాల ప్రకారం ఆల్‌టైం రికార్డుగా చెబుతున్నారు.అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ బాధ్యతలు స్వీకరించడం, స్టాక్ మార్కెట్ నష్టాల్లో ఉండడంతో బంగారం ధర పెరుగుతున్నట్టు వ్యాపారులు చెబుతున్నారు. వచ్చేది మాఘ మాసం వివాహాలు ఎక్కువగా జరుగుతాయి. ఇటువంటి సమయంలో బంగారం ధరలు పెరగడంపై ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నెల 16వ తేదీన 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.73,900 ఉండగా ఇవాళ 75,550కు చేరింది. సుమారు వారంలో ఏకంగా రూ.1650లు పెరిగింది.ఇది ఆల్‌టైమ్ రికార్డుగా చెబుతున్నారు. మరింత పెరిగే అవకాశం ఉన్నట్టు మార్కెట్ కథనం. శుక్రవారం 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.82,420 ఉంది. ఇది రికార్డు..నిపుణులు రూ.లక్ష వరకూ పెరగవచ్చని అంచనా వేస్తున్నారు. వెండి కేజీ ధర రూ.93,700గా ఉంది. ఇటీవల మార్కెట్‌లో కొనుగోళ్లు పెరుగుతున్నాయి. సంక్రాంతి పండగ సీజన్‌లో కళకళలాడిన బంగారం దుకాణాలు, మధ్యలో కొంత తగ్గినా రెండురోజుల నుంచి మళ్లీ కళకళలాడుతున్నాయి. దీంతో బంగారం కొనుగోలుదారులపై కొంత భారం పడుతున్నట్టే చెప్పాలి. ముందుగానే కొనుగోలు చేసి దాచుకున్నవారికి మాత్రం పెరుగుతున్న ధరలు సంతోషాన్నిస్తున్నాయి.

కోర్టు ఆర్డర్ ధిక్కరించిన ఏడుగురికి జైలు

నిడదవోలు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : కోర్టు ఆదేశాలను ధిక్కరించడంతో ఏడుగురికి జడ్జి 14 నెలల జైలు శిక్ష విధించారు. నిడదవోలు మండలం శంకరాపురం (రావిమెట్ల) గ్రామంలో 2016లో చదలవాడ రామకృష్ణ ఇంటి సరిహద్దు విషయమై నిడదవోలు సివిల్ జడ్జి కోర్టు ఇంజక్షన్ ఆర్డర్ ఇవ్వగా ఆ ఆర్డర్‌ను తిరస్కరించి పిర్యాదుదారుడు ఇంటి స్థలంలో ప్రవేశించి పైపులైను కొరకు బోదెను తవ్వగా సమిశ్రగూడెం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేయడం జరిగింది. దీనిపై శుక్రవారం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జి.రామకృష్ణ అందుకు సహకరించిన వీఆర్వో బసవా వెంకట సర్వేశ్వరరావు, చదలవాడ సూర్యారావు, పెంట నాగేశ్వరరావు, చదలవాడ రామకృష్ణ, చదలవాడ నాగమణి, జొన్నకూటి దావీదు, దూలపల్లి కోట సత్యవతి, రాపాక వెంకటేశ్వరరావులకు ఒక్కొక్కరికి 14 నెలల సాధారణ జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.5,700 జరిమానా విధించారు. వీరిలో చదలవాడ రామకృష్ణ మరణించగా మిగిలిన ఏడుగురికి శిక్ష ఖరారు చేసినట్టు సమిశ్రగూడెం పోలీసులు తెలిపారు. ఈ కేసులో ఏపీపీ జె.సింధు ప్రాసిక్యూషన్ తరపున వాదించారు.

టమాట దింటుంది!



- భారీగా తగ్గిన ధర.. కేజీ రూ.13లే
- పడిపోయిన దొమ్మేరు వంకాయలు
- బెండ..దొండకాయలే బెటర్

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరికీ ఒక రోజు వస్తుందనే సామెత.. కూరగాయల విషయం లోనూ వర్తించినట్టే కనబడుతోంది. ఎందుకంటే ధరల విషయంలో ఏనాడూ నేలచూపులు చూడని కొన్ని కూరగాయల ధరలు అనూ హ్యంగా పతనమైతే.. ధర అంతంతమాత్రంగా ఉండే కొన్ని రకాల ధరలు భారీగా పెరుగుతూ పైపైకి వెళ్లడం రైతులను, మార్కెట్ వర్గాలను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. కూరగాయాల్లో ప్రధానంగా రారాజుగా వెలిగే దొమ్మేరు వంకాయల ధర భారీగా పతనమైంది. రైతు బజార్లలో కిలో రూ.20లకు బహిరంగ మార్కెట్లో రూ.30-40లకు దొరుకుతుండడం విశేషం. దొమ్మేరు వంకాయలు కిలో రూ.50ల కంటే ధర తగ్గిన సందర్భాలు అరుదు. ఒక్కోసారి కిలో రూ.70-రూ.80 కూడా ధర ఉంటుంది. అలాంటిది చిత్రంగా దొమ్మేరు వంకాయల ధర పడిపోయింది. మరోపక్క చాలా తక్కువ ధరకే దొరికే బెండకాయలు, దొండకాయల ధరలు అమాంతం ఎగబాకాయి. రైతు బజార్లలోనే బెండకాయలు కిలో రూ.48, బీరకాయలు రూ.38, దొండకాయలు రూ.34 ధర ఉందంటే బహిరంగ మార్కెట్లో వీటి ధరలు ఎంత ఉంటాయో చెప్పనక్కరలేదు. టమోటా ధర పడిపోయింది. నెల రోజుల కిందట రూ.80-రూ.100లకు చేరిన టమోటా ధర అనూహ్యంగా దిగివచ్చింది. రైతు బజార్లలో కిలో రూ.13లకు, బహిరంగ చిల్లర మార్కెట్లలో రూ.15-రూ.20లకు విక్రయిస్తున్నారు. తక్కువ ధరలకే దొరికే ములక్కాడ, పొట్లకాయ, ఆనబకాయ వంటి ధరలు పెరిగిపోయాయి. రైతుబజార్లలో పొట్లకాయ ఒక్కటి రూ.20లు, ములక్కాడ రూ.10లు ధర ఉంది. ఆనబకాయ రూ.15లకు విక్రయిస్తున్నారు. బహిరంగ చిల్లర మార్కెట్లలో ఈ ధరలు మరింత ఎక్కువగా ఉంటాయి. ఈ పరిస్థితికి ప్రధానకారణం వాతావరణ మార్పులే అని రైతులు, వ్యాపారులు చెబుతున్నారు.



కూరగాయలపై వాతావరణం

వాతావరణ పరిస్థితులు వంకాయల దిగుబడికి పూర్తి అనుకూలంగా ఉండడం వల్ల దిగుబడులు గణనీయంగా పెరిగి మార్కెట్‌లో ధరలు పతనమయ్యాయని చెబుతున్నారు. లోకల్‌గా సీతానగరం, కడియం మండలాలు, దొమ్మేరు ప్రాంతం నుంచి వంకాయలు ఎక్కువగా మార్కెట్లకు వస్తున్నాయి. టమోటా పరిస్థితి కూడా ఇంతే. అయితే బెండకాయలు, దొండకాయల విషయంలో ప్రతికూల వాతావరణం కారణంగా దిగుబడులు తగ్గడంతో ధరలు పెరగడానికి కారణంగా పేర్కొంటున్నారు. అలాగే రాత్రిపూట చలి, మంచు ప్రభావంతో బెండకాయలకు వైరస్ సోకి దిగుబడులు పడిపోయినట్టు విశ్లేషిస్తున్నారు. ఏదేమైనా తగ్గేదేలే అంటూ మార్కెట్లో కింగ్‌లా ఉండే దొమ్మేరు రకం వంకాయల ధరలు గణనీయంగా పడిపోవడం వీటిని సాగు చేసే రైతులో గుబులు పుట్టిస్తోంది.

నన్నయ ఇంటర్ యూనివర్సిటీ
మహిళా బాల్ బ్యాడ్మింటన్ జట్టు ఎంపిక



నన్నయ ఇంటర్ యూనిర్సిటీ మహిళా బాల్‌బ్యాడ్మింటన్ టీమ్‌కు ఎంపికైన క్రీడాకారిణిలు

నిడదవోలు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): నిడదవోలులోని ఎస్వీడీ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఆదికవి నన్నయ ఇంటర్ కాలేజీయేట్ యూనివర్సిటీ మహిళా బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంటు, జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. జిల్లాలోని 8 కళాశాలలకు చెందిన మహిళా టీమ్‌లు పోటీపడ్డాయి. ఏలూరులోని సెయింట్ థెరిస్సా కళాశాల మొదటి స్థానం, కొత్తపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల రెండో స్థానం, నిడదవోలు ఎస్వీడీ మహిళా డిగ్రీ కళాశాల మూడో స్థానం, అనపర్తి జీబీఆర్ కళాశాల నాలుగో స్థానంలో నిలిచాయి. ఈ జట్టులలో అత్యుత్తమ ప్రతిభ కనపరచిన క్రీడాకారిణులను నన్నయ యూనివర్సిటీ టీమ్‌కు ఎంపిక చేశారు. జట్టు సభ్యులుగా వి.లక్ష్మీతులసి, ఆర్.వరలక్ష్మి(కొత్తపేట), జె.దివ్య, బి.మల్లిక(నిడదవోలు), జి.పుణ్య, జి.పూజ, పి.నాగ విజయశ్రీ(ఏలూరు), కె.గాయత్రి(అనపర్తి), పి.లీలారమణి(గోపన్నపాలెం), ఎన్.నవ్యశ్రీ(తణుకు) ఎంపిక కాగా సీహెచ్ మేఘన(తణుకు), వి.సుశీల(తాడేపల్లిగూడెం), కె.నవ్యశ్రీ(అనపర్తి) స్టాండ్‌బైగా ఎంపికైనట్టు అధికారులు తెలిపారు. ఈ పోటీలను స్టార్ ఆఫ్ ఇండియా అవార్డు గ్రహీత బండి రాంగోపాల్ ప్రారంభించగా గాలి రాఘవయ్య, సత్తి బాపిరెడ్డి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కంబయ్య, యూనివర్సిటీ అబ్జర్వర్ ఉషారాణి పాల్గొన్నారు.

వరిసాగులో సస్యరక్షణ పద్ధతులు తప్పనిసరి

» జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు » తాడిపర్రులో బోర్లు ద్వారా వేసిన పంట పరిశీలన



తాడిపర్రులో వరిపంటను పరిశీలిస్తున్న మాధవరావు

ఉండ్రాజవరం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): వరిసాగులో సస్యరక్షణ పద్ధతులు తప్పనిసరిగా పాటించాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు పేర్కొన్నారు. మండలంలోని తాడిపర్రు గ్రామంలో బోర్లు ద్వారా సాగుచేసిన పంట పొలాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బోరు ద్వారా సాగు చేసిన పొలంలో సల్ఫర్ ఎక్కువ వాడడం వల్ల వరి కుదుళ్లు కుళ్లిపోయాయన్నారు. కాంప్లెక్సు ఎరువు వాడడం వల్ల అనర్థం కలుగుతుందని చెప్పారు. కుదుళ్లు కుళ్లిపోవడం నివారణకు గాను ఎకరానికి 45 కిలోల యూరియా వేయాలని, నీరు తీసి పంటను ఆరకట్టడం వల్ల ఈ తెగులు నుంచి వరిని కాపాడవచ్చని వ్యవసాయాధికారి మాధవరావు సూచించారు. రైతులకు ఎరువులు డీలర్ల వద్ద, సొసైటీలలో అందుబాటులో ఉన్నట్టు చెప్పారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త పి.నరసింహారావు, ఏవో ఎం.విశ్వాసరావు, రైతులు పాల్గొన్నారు.

కోటసత్తెమ్మ ఆలయంలో నాగేంద్ర ప్రత్యేక పూజలు



తిమ్మరాజుపాలెం కోటసత్తెమ్మ ఆలయం వద్ద బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర, తదితరులు

నిడదవోలు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): భారతీయ జనత పార్టీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర శుక్రవారం నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలోని కోటసత్తెమ్మ దేవస్థానంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని రాష్ట్రంలో తెలుగుదేశం, బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి వేగవంతం అయ్యిందన్నారు. ఈ సందర్భంగా నాగేంద్ర వెంట బీజేపీ పట్టణాధ్యక్షుడు మోర్త ప్రమోద్ కుమార్, బండి సత్యనారాయణ, మోర్త సాయి, చామంతి భీమేశ్వరరావు, కిషోర్, అనిల్ తదితర్లు పాల్గొన్నారు.

పశువుల్లో వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కొవ్వూరు పశు సంవర్ధక శాఖ డీడీ సత్యనారాయణ



వేములూరులో పశు వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సత్యనారాయణ

కొవ్వూరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): పాడి పశువులకు వచ్చే వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని కొవ్వూరు పశు సంవర్ధకశాఖ ఉప సంచాలకుడు డాక్టర్ ఎస్.సత్యనారాయణ అన్నారు. కొవ్వూరు మండలం వేములూరులోని రైతు సేవ కేంద్రంలో సహాయ సంచాలకుడు ఎ.వెంకటరెడ్డి ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరం నిర్వహించారు. సత్యనారాయణ మాట్లాడుతూ పశు సంవర్ధక శాఖలో అమలవుతున్న ఉరూర పశు గ్రాస క్షేత్రాలు, పెయ్యిదూడల సీమెన్ వంటి పథకాలు, టీకాలు గురించి వివరించారు. దూడల సంరక్షణ, కాలానుగుణంగా వచ్చే వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. అనంతరం 68 పెద్ద పశువులకు చికిత్స అందజేశారు. 120 పెద్ద పశువులకు, 30 చిన్న పశువులకు నట్టల నివారణ మందులు, 24 పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స అందించారు. కార్యక్రమంలో పశు వైద్యులు డాక్టర్ జి.సోమశేఖర్, డాక్టర్ కె.చంద్రమౌళి, సహాయకులు, గోపాలమిత్రలు, రైతులు పాల్గొన్నారు.

క్షయ నివారణే ధ్యేయం



క్షయ బాధితులకు పోషకాహార కిట్లు పంపిణీ

నల్లజర్ల, జనవరి 24(ఆంధ్రజ్యోతి): క్షయ నివారణే ధ్యేయంగా పని చేద్దామని డాక్టర్ సిరాజ్ ఉద్దీన్ పేర్కొన్నారు. శుక్రవారం నల్లజర్ల పీహెచ్‌సీలో క్షయ రోగులకు పోషకాహార కిట్లు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ క్షయ రోగులు క్రమం తప్పకుండా మందులు వాడడంతోపాటు పోషకాహారం తీసుకోవాలన్నారు. రీచ్ ప్రాజెక్ట్ సంస్థ క్షయ రోగులకు పోషకాహార కిట్లు ఇవ్వడం ఆనందదాయకమన్నారు. కార్యక్రమంలో రీచ్ ప్రాజెక్టు జిల్లా కో-అర్డినేటర్ వర్మ, ఉద్యోగుల సంఘం నాయకులు జీవీవీ ప్రసాద్, గంగభవానీ, సత్యనారాయణ, షరీఫ్, నాగమణి పాల్గొన్నారు.

సేంద్రీయ ఆకు కూరల పంపిణీ



ఘంటా వారి గూడెంలో ఆకు కూరలు పంపిణీ చేస్తున్న సత్యనారాయణ

నల్లజర్ల, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత రోజుల్లో రసాయన పురుగుమందులు వాడి ఆకు కూరలను సైతం కలుషితం చేయడం ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులు అనారోగ్యం పాలవుతున్నారని, ఇంటి పెరట్లో పెంచుకున్న కూరగాయాలు, ఆకు కూరలకు ప్రాధాన్యం కల్పించాలని టీడీపీ మండలాధ్యక్షుడు తాతిన సత్యనారాయణ పేర్కొన్నారు. దూబచర్ల సెక్టార్ పరిధిలో శింగరాజుపాలెం, ఘంటావారి గూడెం గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో సేంద్రీయ పద్ధతుల్లో పండించిన ఆకు కూరలను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజులపూడి సుభాషిణి, ఆదినారాయణ, నాదెళ్ల శ్రీరామ్‌చౌదరి, సూపర్‌వైజర్ హారతి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు

కొవ్వూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిని కొట్టి కాళ్లతో తన్నిన సంఘటనపై కేసునమోదు చేసినట్టు ఎస్‌ఐ కె.జగన్మోహనరావు తెలిపారు. కొవ్వూరు పట్టణానికి చెందిన ఉప్పాడ సత్యనారాయణ బట్టలు కుట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 10న అదే కాలనీకి చెందిన ఎరుపల్లి మసేను.. తన వద్దకు వచ్చి ఘర్షణ పడి, చెంపపై కొట్టి, కాళ్లతో తన్నినట్టు సత్యనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసునమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

ఆర్టీసీ అన్‌క్లెయిమ్డ్/అన్ ఐడెంటిఫైడ్
పార్శిల్స్ 29న వేలం

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని ఆర్టీసీ పార్శిల్ బుకింగ్ కార్యాలయం వద్ద ఈనెల 29న బుధవారం అన్ క్లెయిమ్డ్/అన్ ఐడెంటిఫైడ్ పార్శిల్స్‌ను బహిరంగ వేలం నిర్వహించనున్నామని ఆర్టీసీ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ మాధవ ఓ ప్రకటనలో తెలిపారు.

ప్రమాదరహిత డ్రైవింగ్ చేయాలి

» కొవ్వూరు ఎంవీఐ శివప్రసాద్
» పలుచోట్ల డ్రైవర్స్ డే
» రోడ్డు భద్రతా మాసోత్సవాలు



కొవ్వూరులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు. ఆర్టీసి సిబ్బంది

కొవ్వూరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): డ్రైవర్లు ప్రమాద రహిత డ్రైవింగ్ చేయాలని కొవ్వూరు మోటారు వెహికల్ ఇన్స్‌పెక్టర్ కె.శివప్రసాద్ అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా కొవ్వూరు ఆర్టీసి డిపోలో శుక్రవారం డిపో మేనేజర్ వైవీవీఎస్ కుమార్ ఆధ్వర్యంలో థ్యాంకు ఫర్ సేఫ్టీ డ్రైవింగ్ కార్యక్రమాన్ని చేపట్టారు. ముఖ్య అతిథులుగా మోటారు వెహికల్ ఇన్స్‌పెక్టర్ శివప్రసాద్, సీఐ పి.విశ్వం పాల్గొని డ్రైవర్లకు పుష్పగుచ్ఛం, వాటర్‌బాటిల్, స్వీట్స్ ఇచ్చి ప్రశంసించారు. అనంతరం డ్రైవర్స్ డే సందర్భంగా డ్రైవర్స్‌తో కేక్ కట్ చేయించారు. ఏబీఎన్ కళాశాల విద్యార్థులు, ఆటోడ్రైవర్లు, ఆర్టీసీ సిబ్బంది ప్లకార్డులతో నినాదాలు చేస్తూ పట్టణ పుర వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. శివప్రసాద్ మాట్లాడుతూ డ్రైవర్లు విధిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, డ్రైవర్లు రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తూ మంచి డ్రైవింగ్ నైపుణ్యాలను అలవర్చుకోవాలన్నారు.

నల్లజర్ల: నల్లజర్ల హైస్కూల్లో డ్రైవర్స్ డే నిర్వహించారు. ఉపాధ్యాయులు తాడేపల్లిగూడెం డిపో ఆర్టీసీ బస్సు డ్రైవర్లను సత్కరించారు. ఈ సందర్భంగా డిపో మేనేజరు వైఎస్ఎన్ మూర్తి, హెచ్ఎం కోమల చిత్ర మాట్లాడుతూ చక్కటి నైపుణ్యం, అంకిత భావంతో ప్రయాణికులను, విద్యార్థులను గమ్యస్థానాలకు సురక్షితంగా చేర్చే బాధ్యత డ్రైవర్లు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డ్రైవర్లు పి.సైదియ్య, జి.రాజాబాబు, బి.బలరాం రాజు, ఎన్ఎస్ వాసు, వైఈఎస్ గణేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిడదవోలు: నిడదవోలులో ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో డ్రైవర్స్ డే నిర్వహించారు. డ్రైవర్లు సురక్షితంగా డ్రైవింగ్ చేయడం వల్లనే ప్రయాణి కులు గమ్యస్థానాలకు చేరుతున్నారని డిపో మేనేజర్ కె.వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలో డ్రైవర్లను అభినందిస్తూ పూలతో సత్కరిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డిపో సెక్యూరిటీ, ట్రాఫిక్, మెకానికల్ స్టాఫ్, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



నల్లజర్ల హైస్కూల్లో ఆర్టీసీ డ్రైవర్లకు సత్కారం



నిడదవోలు ఆర్టీసీ డిపో వద్ద డ్రైవర్స్ డే

కొవ్వూరు వాసులకు గోదావరి జలాలు

» కొవ్వూరు టౌన్‌కు రూ.60 కోట్లు, రూరల్‌కు రూ.110 కోట్లతో అంచనాలు
» ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు



కొవ్వూరులో పైపులైను పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): గోదావరి ఉపరితల జలాలను శుద్ధిచేసి నియోజకవర్గ ప్రజలకు అందించడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందించినట్టు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం సత్యవతినగర్‌లో మున్సిపల్ తాగునీటి పైపులైన్ పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సత్యవతినగర్, పరిసర ప్రాంతాల్లో ప్రజలు 2014 నుంచి తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాటిని పరిష్కరించేందుకు మున్సిపల్ నిధులు రూ. 7.70 లక్షలతో రెండు విడతలుగా పైపులైను పనులను చేపడుతున్నామన్నారు. పనులను వారం రోజుల్లో పూర్తిచేసి తాగునీటిని అందిస్తామన్నారు. గోదావరి జలాలు శుద్ధిచేసి అందించేందుకు కొవ్వూరు టౌన్‌కు రూ.60 కోట్లు, రూరల్‌కు రూ.110 కోట్లతో అంచనాలు తయారుచేసి ప్రభుత్వానికి అందించామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు, మద్దిపట్ల శివరామకృష్ణ, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, డేగల రాము, మున్సిపల్ ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి సత్కారం

ఎమ్మెల్యే వెంకటేశ్వరరావును బీజేపీ నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికయిన పిక్కి నాగేంద్రకు అభినందనలు తెలియజేశారు. అనంతరం నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. కార్యక్రమంలో పరిమి రాధ, కోడూరి లక్ష్మీనారాయణ, కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ, గన్నమని భాస్కరరావు, జగన్, పవన్, తేజ, కమల్ పాల్గొన్నారు.

దీర్ఘకాలిక భూసమస్యల
పరిష్కారానికి రీసర్వే

గోపాలపురం, జనవరి 24(ఆంధ్రజ్యోతి) దీర్ఘకాలిక భూసమస్యల పరిష్కారానికి రీసర్వే తోడ్పడుతుందని తహశీల్దార్ అజయ్ బాబు అన్నారు. మండలంలోని గుడ్డిగూడెం శుక్రవారం గ్రామంలో రీసర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా 25 రైతులకు చెందిన 65ఎకరాల భూమిని రీసర్వే చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అల్పాహారం

తాళ్లపూడి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేగేశ్వరపురం జడ్పీ హైస్కూల్లోని పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం దాతల సహకారంతో అల్పాహారాన్ని అందించారు. ఎంఈవో సీహెచ్ బాలామణి మాట్లాడుతూ కొంతకాలంగా విద్యార్థులకు సహకారం అందిస్తున్న దాత కుందుల సత్యం సాయంత్రం అల్పాహారానికి సహకారం అందించారన్నారు. కార్యక్రమంలో కుందుల సత్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీకామేశ్వరరావుకు డాక్టరేట్

నిడదవోలు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): నిడదవోలులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల గణిత అధ్యాపకుడు ఎం.శ్రీకామేశ్వరరావుకు తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రకటించింది. సిగ్మా, రివర్స్ డైవర్షన్స్ ఇన్ రేంజర్స్ అనే ఆల్‌జీబ్రా అంశంపై సమర్పించిన పరిశోధనా గ్రంథానికి డాక్టరేట్ ప్రకటించినట్టు శ్రీకామేశ్వరరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయనను అధ్యాపకులు అభినందించారు.

బాలిక అదృశ్యం

కొవ్వూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు రూరల్ సీఐ కె.శ్రీహరి తెలిపారు. కడియం మండలానికి చెందిన జి.వీర్రాజు భార్య తన ముగ్గురు పిల్లలతో సంక్రాంతి పండుగకు అమ్మగారి ఇంటికి ఈ నెల 12న కొవ్వూరు మండలం దేచర్ల గ్రామం వచ్చింది. 23న తిరిగి ఇంటికి ప్రయాణమయ్యారు. ఇంటి నుంచి బయటకు వెళ్లిన కుమార్తె కనిపించడం లేదని భర్తకు తెలిపారు. చుట్టుపక్కల వెతికినా కనిపించకపోవడంతో కొవ్వూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తిత్వ వికాసం పెంపొందించుకోవాలి

» ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిరీష
» జాతీయ బాలిక దినోత్సవం
» పలు పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు



చాగల్లులో బాలిక దినోత్సవంలో పాల్గొన్న శిరీష తదితరులు

చాగల్లు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): బాలికలు వ్యక్తిత్వ వికాశం పెంపొందించుకోవాలని, ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.శిరీష అన్నారు. జాతీయ బాలిక దినోత్సవం, కిశోర బాలిక వికాసం కార్యక్రమాలు శుక్రవారం పలుచోట్ల నిర్వహించారు. మార్కొండపాడు జిల్లాపరిషత్ హైస్కూల్లో జరిగిన కార్యక్రమంలో శిరీష మాట్లాడుతూ యువత సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండాలని, ఉపాధి అవకాశాల కోసం నైపుణ్యం పెంచుకోవాలని అన్నారు. ప్రధానోపాధ్యాయురాలు వి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: అన్నదేవరపేట జడ్పీ హైస్కూల్లో శుక్రవారం బేటీ బచావో బేటీ పడావోపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన స్థానిక పీహెచ్‌సీ డాక్టరు ఆలీ మాట్లాడుతూ బాలికలు యుక్త వయస్సుకు వచ్చే సరికి శారీరక, మానసిక పరిస్థితులు మెరుగ్గా ఉండేలా చూసుకోవాలని, మంచి పోషకాహార విలువలు ఉండే ఆహారాన్ని తీసుకోవాలని, క్రీడల్లో రాణించాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు అర్జునరావు మాట్లాడుతూ ఆడపిల్లలకు మగపిల్లలతో సమానంగా అవకాశాలను కల్పించాల్సిన బాధ్యత పెద్దలపైనే ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

నిడదవోలు: నిడదవోలులోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జరిగిన ఒక రోజు వర్క్ షాప్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన మహిళా వ్యాపారవేత్త రొంగల సరోజ మాట్లా డుతూ మహిళలు గృహిణిగా ఇంటి బాధ్యతలు సక్రమంగా నిర్వహిస్తూనే తమకు ఆసక్తి ఉన్న రంగంలో ఎదిగేందుకు ప్రయత్నించాలన్నారు. ఇందు కోసం వారు కమ్యూనికేషన్ స్కిల్స్ పాజిటివ్ థింకింగ్ అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.జ్యోతి, కె.జాస్మిన్, టి.హనుమంతరావు, సీఎస్ఎస్ స్రవంతి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: ఉండ్రాజవరం హైస్కూల్లో విద్యార్థినిలకు పీహెచ్‌సీ డాక్టర్ ఆర్.ఉషాదేవి యుక్త వయస్సులో వచ్చే మార్పులు, కౌమార దశలో వచ్చే మార్పులు గురించి వివరించారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని, విద్య పట్ల శ్రద్ధ వహించి చదవాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో సుబ్రహ్మణ్యం, పీహెచ్ఎన్ కుమారి, ఆరోగ్య సిబ్బంది, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

దేవరపల్లి: మండలంలోని గౌరీపట్నం జడ్పీ హైస్కూల్లో జరిగిన బాలికల దినోత్సవంలో స్థానిక కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎ.శ్రీకృష్ణుడు మాట్లాడుతూ బాలికలు మానసికంగా దృడంగా ఉండాలని, బాలురకు దీటుగా అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, పాఠశాల సిబ్బంది, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

గోపాలపురం: స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద బాలికా దినోత్సవాన్ని జరిపారు. కార్యాల యం నుంచి చెక్‌పోస్టు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



ఉండ్రాజవరంలో మాట్లాడుతున్న డాక్టర్ ఉషాదేవి




నిడదవోలు మహిళా కళాశాలలో వ్యాపారవేత్త సరోజకు సత్కారం



అన్నదేవరపేట హైస్కూల్లో అవగాహన సదస్సు

మంచు కురిసే వేళలో..





నిడదవోలు/చాగల్లు, జనవరి 24, (ఆంధ్రజ్యోతి): నిడదవోలు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది తొలిమంచు కురిసింది. శుక్రవారం ఉదయం 8 గంటలకు కూడా మంచు కురుస్తూ ఉండడంతో పక్కనుండి వెళుతున్న వాహనాలే కాదు పక్కనున్న మనుషులు కూడా కనపడని పరిస్థితి నెలకొంది. నిడదవోలు పట్టణం, సమిశ్రగూడెం బ్రిడ్జి వద్ద, చాగల్లు-పంగిడి మెయిన్‌రోడ్డుపై పొగమంచు దట్టంగా కమ్మేడంతో వాహన రాకపోకలకు ఇబ్బంది కలిగింది. తేలిక పాటి వర్షం చినుకులుగా కురిసిన చందంగా ఉదయం 8 గంటల వరకు పడింది. పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు మంచు వర్షాన్ని చూసి ఆస్వాదించారు. ప్రకృతి ప్రియులు అరుదైన మంచు దృశ్యాలు చూస్తూ ఆనందించారు.

రక్తదానంతో ప్రాణదానం

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రక్తదానంతో మరొకరికి ప్రాణదానం చేయవచ్చని డ్రగ్స్ విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ డి.నాగమణి అన్నారు. శుక్రవారం జిల్లా డ్రగ్ ట్రేడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆలిండియా సంఘం 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా రాజమహేంద్రవరంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తదాతల నుంచి 160 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరావు, కార్యదర్శి పి.గణపతి, కోశాధికారి కె.శ్రీనివాసరావు, డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్లు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాల విద్యార్థులకు క్విజ్,
వ్యాసరచన పోటీలు

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రిపబ్లిక్ డే సందర్భంగా రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, పోస్టర్ ప్రజంటేషన్ పోటీలు నిర్వహించారు. రాజనీతిశాస్త్ర విభాగం, చరిత్ర శాఖల సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థుల్లో దేశభక్తిని, రాజ్యాంగ స్ఫూర్తిని పెంపొందించడానికి ఈ పోటీలు నిర్వహించినట్టు రాజనీతిశాస్త్ర అధ్యాపకురాలు సయ్యద్ ఫరా ఎక్రూన్, చరిత్రశాఖ విభాగాధిపతి బి.అంజనికుమారి తెలిపారు. విజేతలకు ఈనెల 26న బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు. రాజనీతిశాస్త్ర విభాగాధిపతి పి.బాబ్జీ, చరిత్ర, రాజనీతిశాస్త్ర అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎస్‌టీపీ ప్లాంట్ పనులు వేగంగా పూర్తిచేయాలి

» జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి
» కమిషనర్ కేతన్‌గార్గ్‌తో కలిసి అభివృద్ధి పనుల పరిశీలన

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 24(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం పరిధిలో అమృత్ పథకంలో నిర్మిస్తున్న ఎస్‌టీపీ ప్లాంట్ పనులు వేగంగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. రాజమహేంద్రవరం నగర, రూరల్ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆమె పరిశీలించారు. శుక్రవారం రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్‌గార్గ్‌తో కలిసి వెంకట్రామయ్య నగర్‌లో నిర్మాణంలో ఉన్న ఇండోర్ స్టేడియంను, అమృత్ పథకంలో హుకుంపేట గ్రామంలో నిర్మిస్తున్న 50.60 ఎంఎల్‌డీ ఎస్‌టీపీ ప్లాంటు పనులను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వెంకట్రామయ్యనగర్‌లో నగరపాలక సంస్థ సాధారణ నిధులు రూ.3 కోట్లతో ప్రస్తుతం ఉన్న బ్యాడ్మింటన్ కోర్టు ఆవరణలో గ్రౌండ ఫ్లోర్, రెండు అంతస్తులుగా ఇన్‌డోర్ స్పోర్ట్స్ కాంప్లెక్సు నిర్మాణం చేపట్టారని ఇందులో చెస్, క్యారమ్స్, టేబుల్ టెన్నిస్ ఆటలు ఆడుకోవడానికి అన్ని ఏర్పాట్లతో పాటు జిమ్ ఎక్విప్‌మెంట్ ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఇప్పటికే 82శాతం పనులు పూర్తిచేశారని మిగిలినవి అతి త్వరలో పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే హుకుంపేటలో ప్రస్తుతం ఉన్న 30ఎల్ఎల్‌డీ సీవేజీ ట్రీట్‌మెంట్ ప్లాంట్ పనితీరును, లేబరేటరీలో ట్రీట్ చేస్తున్న నీటిని కలెక్టర్ పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న 30 ఎంఎల్‌డీ సీవేజీ ట్రీట్‌మెంట్ ప్లాంటు జనాభా అవసరాలకు సరిపోవడంలేదన్నారు. రాబోయే రోజుల్లో పెరిగే జనాభాను దృష్టిలో పెట్టుకుని అదనంగా 60 ఎంఎల్‌డీ ఎస్‌టీపీని రూ88.43 కోట్లతో నిర్మిస్తున్నామని, 50శాతం పనులు పూర్తయ్యాయని త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువస్తామని కమిషనర్ కేతన్ గార్గ్ వివరించారు. కార్యక్రమంలో ఎస్ఈ పాండురంగారావు ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.